



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 14, పేజీలు - 08

బుధవారం, జులై 8, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD





# కలెక్టర్ ఫైల్ కదలదు..

# కబ్జాదారుల జోరు తగ్గదు

- బండ్లగూడలో రూ.800 కోట్ల భూ కుంభకోణం.. 'నిద్ర' పోతున్న సర్కారు యంత్రాంగం
- ఫైళ్ల మీద ఫైళ్లు.. కానీ కలెక్టర్ టేబుల్ మీద మాత్రం మంచు ముక్కలే.?
- చట్టం తన పని తాను చేసుకుపోతుందా.? లేక కబ్జాదారుల కోసం 'రహదారి' వెతుకుతుందా.?
- కాగితాల మీద కబ్జాదారుల దౌర్జన్యం, కార్యాలయాల్లో అధికారుల 'మౌన వ్రతం'



మిక్కిలినేని మను చౌదరి
జిల్లా కలెక్టర్

**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** ఉప్పల్ మండలం బండ్లగూడలోని సర్వే నంబర్ 36/5లో ఉన్న సుమారు 10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. సుమారు రూ.800 కోట్ల విలువైన ఈ భూమిని నకిలీ పత్రాలతో కాజేసి, 'పల్లవి డీబీఆర్ గార్డెనియా' పేరుతో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టును చేపట్టి అమాయక ప్రజలకు విక్రయిస్తున్న వైనంపై సామాజికవేత్త పట్నం బాబా గౌడ్ పోరాటంతో "ప్రజా ప్రశ్న" దినపత్రికలో వరుస కథనాలతో ఎండగడుతున్న విషయం విదితమే. ఈ అక్రమాల్లో రెవెన్యూ అధికారుల పాత్రపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ 'స్వాతంత్ర్య సమరయోధుడు' ముసుగులో భూ బాగోతం రచకొండ కనకయ్య అనే కల్పిత వ్యక్తిని 'స్వాతంత్ర్య సమరయోధుడు'గా పేర్కొంటూ డి. భాస్కర్ రెడ్డి తదితరులు బూటకపు పత్రాలను సృష్టించారు. అయితే, హోం, రెవెన్యూ శాఖలు జరిపిన సమగ్ర విచారణలో కనకయ్య అసలు స్వాతంత్ర్య సమరయోధుడే కాదని, ఆయనకు ఎటువంటి భూ కేటాయింపులు జరగలేదని తేలింది. ఈ అక్రమాలను గుర్తించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గత జనవరిలో నిర్మాణాలను నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ, కబ్జాదారుల ఆగడాలకు అడ్డుకట్ట పడలేదు."అతి సర్వత్ర వర్జయేత్" అన్నట్లు, ఈ భూ కబ్జాదారుల అరాచకాలు హద్దులు దాటిపోయాయి. తమ స్వార్థం కోసం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కూడా అపహాస్యం చేసేలా నకిలీ పత్రాలను సృష్టించడం విస్మయానికి గురిచేస్తోంది.

### కోర్టులోనూ కాలయాపన - అధికారుల ఉదాసీనత

కలెక్టర్ ఆదేశాలను సవాలు చేస్తూ 'పల్లవి డెవలపర్స్' హైకోర్టును ఆశ్రయించింది. అయితే, గత జూన్ నుంచి కేసు విచారణ జరుగుతున్నా, ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేయడంలో అధికారులు చూపుతున్న తీవ్ర జాప్యం అనేక సందేహాలకు తావిస్తోంది. జూన్ 27, 2026న ఆర్డీఓ సమర్పించిన 'ఎంజాయ్‌మెంట్ సర్వే' నివేదికను సీసీఎల్ఏ ఉన్నతాధికారులకు పంపకుండా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే ఫైల్ ఆగిపోవడం వెనుక ఉన్న కుట్రపై ఆరోపణలు వస్తున్నాయి.

### సీబీఐ, ఈడీ విచారణకు బాధితుల డిమాండ్

ఈ కుంభకోణం కేవలం భూ ఆక్రమణకే పరిమితం కాలేదు. ప్రభుత్వ భూమిని తనఖా పెట్టి బ్యాంకుల నుంచి భారీగా రుణాలు పొంది, బ్యాంకింగ్ వ్యవస్థను కూడా నిందితులు మోసం చేశారని సామాజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్ ఆరోపించారు.

- అక్రమాలపై ఎఫ్ఐఆర్ నమోదు: ఈ అక్రమాలపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నెం, 1821/2022 నమోదైంది.
- బ్యాంకింగ్ మోసం: ప్రభుత్వ భూమిని తాకట్టు పెట్టి నిధులు రాబట్టిన వైనం.
- న్యాయ విచారణ: మనీ లాండరింగ్ కోణం ఉన్నందున సీబీఐ, ఈడీ సంస్థలతో విచారణ జరిపించాలని బాధితులు కోరుతున్నారు.


ప్రజాప్రశ్న

రూ. 800 కోట్ల ప్రభుత్వ భూమి

'మహా కుంభకోణం'

(నివేదికలున్నా నిమ్మకు నీరెత్తిన అధికారులు!)

దేప భాస్కర్ రెడ్డి

A PREMIUM GATED COMMUNITY TO ELEVATE YOUR LIFESTYLE

PALLAVI DBR Gardenia

"నిద్రపోతున్న వారిని లేపవచ్చు, కానీ నిద్ర నటిస్తున్న వారిని లేపలేము" అన్న చందంగా, వాస్తవాలు కళ్లముందు కనిపిస్తున్నా రెవెన్యూ అధికారులు మొద్దు నిద్ర వీడకపోవడం వెనుక పెద్దల హస్తం ఉందన్నది సుస్పష్టం అని, ప్రభుత్వం వెంటనే స్పందించి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రిన్సిపల్ సెక్రటరీ స్వయంగా రంగంలోకి దిగి ఈ భూ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని బాబా గౌడ్ డిమాండ్ చేస్తున్నారు.

## ఏపీలో హస్తకళల పర్యాటకం అభివృద్ధి

**- పవన్ కల్యాణ్ కీలక ప్రకటన**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ఆధ్యాత్మిక, పర్యావరణ పర్యాటకం తరహాలోనే 'హస్తకళల పర్యాటకాన్ని' కూడా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. మంగళవారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆంధ్రప్రదేశ్ హస్తకళల ఉత్సవం 2026'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్న కళాకారులను గుర్తించి, వారిని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. కళాకారుల జీవన విధానం, వారు ఎదుర్కొంటున్న

2లో..

## మంత్రిని గౌరవించమని కడియం శ్రీహరికి చెప్పండి

- దేవాదాయశాఖలో కడియం జోక్యం
- కొండా సురేఖ ఆగ్రహం
- సీఎం రేవంత్ రెడ్డికి కొండా సురేఖ లేఖ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల మధ్య దశాబ్దాలుగా నడుస్తున్న రాజకీయ వైరం ఇప్పుడు అధికారికంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు చేరింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా ఉన్న తనను పూర్తిగా విస్మరించి, తన శాఖా పరిధిలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

2లో..

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఆర్థిక ఉగ్రవాదులు

- మేడిగడ్డ బ్యారేజీ వెన్నుపూస లాంటిది
- కేసీఆర్‌ది ఆర్థిక ఉగ్రవాద కుటుంబం
- కేసీఆర్ లేఖ రాస్తే శాసనసభలో చర్చిద్దామని సవాల్
- డేట్,టైం చాయిస్ కేసీఆర్, కేటీఆర్, హరీష్‌కే

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారం మరోసారి కార్చిచ్చులా రగులుకుంది. హైదరాబాద్ ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అగ్రనాయకత్వంపై మునుపెన్నడూ లేనంతగా నిప్పులు చెరిగారు. నీటిపారుదల శాఖ మంత్రి



2లో..

## సీఎం పర్యటనలను మేము నియంత్రించాలా.?

- డీఎంకేపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తమిళనాడులోని గతేడాది జరిగిన కరూర్ జిల్లాలో తొక్కిసలాట ఘటన నేపథ్యంలో డీఎంకే దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జోసెఫ్ విజయ్ జులై 10న తొలిసారి కరూర్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ క్రమంలో తొక్కిసలాట మృతుల కుటుంబాలతో సీఎం కలవకుండా బహిరంగ ప్రకటనలు చేయకుండా నిరోధించాలని డీఎంకే చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ముఖ్యమంత్రి పర్యటనలను తాము నియంత్రించాలా.? అని జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ ఆరాధేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ పౌరులందరికీ భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంటుందని దానిపై తాము ఆంక్షలు విధించాలా.? అంటూ నిలదీసింది. కరూర్ తొక్కిసలాట ఘటనపై తాము స్వయంగా సీబీఐ విచారణకు ఆదేశించామని, అలాంటప్పుడు రాజకీయ ప్రత్యర్థి పిటిషన్‌ను ఎలా అంగీకరిస్తామని కోర్టు ప్రశ్నించింది. సుప్రీంకోర్టును రాజకీయ వేదికగా మార్చొద్దని

2లో..

## గ్రేటర్‌లో "త్రిశూల" వ్యూహం

**- కాంగ్రెస్ కు బీజేపీ చెక్!**

- గ్రేటర్ పోరుకు బీజేపీ జంగ్ సైరన్!
- జాతీయ నాయకత్వానికి పెద్ద సవాల్
- మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో గెలవకపోతే భవిష్యత్తు శూన్యమేనా?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో తదుపరి సమరం హైదరాబాద్ మహానగరం వేదికగా ప్రారంభం కానుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పాత 1955 నాటి యాక్ట్‌ను రద్దు చేసి పాత గ్రేటర్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించి, డివిజన్ల సంఖ్యను 150 నుండి ఏకంగా 300 కి పెంచి ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ వేస్తున్న ఈ త్రిశూల వ్యూహాన్ని తిప్పికొట్టి, హైదరాబాద్‌పై ఎలాగైనా జెండా ఎగరేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ హైకమాండ్ తన వ్యూహాలకు పదును పెట్టింది.

2లో..

## ఏపీకి పెట్టుబడుల వెల్లువ

- రూ.9,076 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- మొత్తం 11 ప్రాజెక్టుల ద్వారా 10,531 మందికి ఉద్యోగాలు
- రైతు కుటుంబాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సీఎం
- పర్యాటక రంగం అభివృద్ధికి 100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు

అమరావతి (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచన చేసారు. రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చేలా వారు ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ జరగాలని సూచించారు. ఆ దిశగా పెట్టబడులు రావాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో పెరిగే ఇథనాల్ డిమాండ్‌ను అందిపుచ్చుకోవాలని చెప్పారు. సంపద సృష్టి, సర్క్యులర్ ఎకానమీ అనేది ప్రభుత్వ విధానం గా చంద్రబాబు చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో కొత్త పెట్టబుడుల కు ఆమోదం తెలిపారు. 19వ

2లో..



## ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

**బాలామృతం ప్లాంట్ ను ప్రారంభించిన సీఎం రేవంత్**

- హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తాం
- గర్భిణీల నుంచి 6 ఏళ్ల పిల్లల వరకు పౌష్టికాహారం
- నెలకు 10 వేల టన్నుల బాలామృతం తయారీ

హైదరాబాద్ నాచారంలో బాలామృతం ప్లాంట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి మహిళలు, చిన్నారుల సంక్షేమంపై కీలక ప్రకటనలు చేశారు. గర్భిణీల నుంచి 6 ఏళ్ల పిల్లలకు పౌష్టికాహారం, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్, మహిళల సాధికారత, ఇందిరమ్మ ఇళ్లు, విద్యపై రూ.27 వేల కోట్ల ఖర్చు వంటి అంశాలను వెల్లడించారు.



2లో..

## ఏపీలో హస్తకళల పర్యాటకం అభివృద్ధి

చాటిచెప్పేలా ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. క్లస్టర్ల వారీగా ఉమ్మడి సౌకర్య కేంద్రాలను (కామన్ ఫెసిలిటీ సెంటర్లు) ఏర్పాటు చేస్తామని, చేతివృత్తుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే, కళాకారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.అనంతరం, ఉత్సవం ప్రాంగణంలోని స్టాళ్లను సందర్శించిన పవన్ కల్యాణ్ కళాకారులతో ముచ్చటించారు. కాకినాడ తోలుబొమ్మలాట, ఉప్పాడ జామ్దానీ చీరలు, కలంకారీ కళాఖండాలు, తిరుపతి కొయ్యబొమ్మలు, నరసాపురం లేస్ ఉత్పత్తులతో పాటు అరటి నారతో రూపొందించిన వస్తువులను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయంగా కొన్ని ఉప్పాడ చీరలను, అరటి నారతో చేసిన హ్యాండ్‌బ్యాగ్‌ను కొనుగోలు చేసి కళాకారులను వ్యక్తిగతంగా అభినందించారు. రామాయణ, మహాభారత ఘట్టాలను ప్రతిబింబిస్తూ సాగిన తోలుబొమ్మలాట ప్రదర్శన పవన్ కల్యాణ్‌ను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రాచీన కళకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు, రాబోయే గోదావరి పుష్కరాల సమయంలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆయన కళాకారులకు హామీ ఇచ్చారు.

## మంత్రిని గౌరవించమని కడియం శ్రీహరికి చెప్పండి

అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జూలై 7, 2026 నాటి అధికారిక లేఖ ద్వారా ఆమె సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా ఫిర్యాదు చేస్తూ కడియం శ్రీహరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపుతోంది.ఈ వివాదానికి అసలు కారణం జూలై 6వ తేదీన హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిర్వహించిన ప్రత్యేక సమావేశమే. మంత్రి సురేఖకు గానీ, ఆమె కార్యాలయానికి గానీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి నేరుగా దేవాదాయ శాఖ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులను పిలిపించుకుని పలు దేవాలయాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. అంతేకాకుండా, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, ప్రత్యేక అధికారుల బృందం ఏర్పాటు, ఒక నెల రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలంటూ అధికారులకు ఎమ్మెల్యే స్థాయిలోనే ఆదేశాలు జారీ చేయడంపై కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.మాస్టర్ ప్లాన్లు, అధికారుల కమిటీల ఏర్పాటు వంటివి పూర్తిగా శాఖా మంత్రి స్థాయిలో నిర్ణయించాల్సిన అంశాలు. ఒక ఎమ్మెల్యే ఇలా సమీక్ష చేయడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయం. ఇది కేవలం పరిపాలనా లోపం కాదు, నా రాజ్యాంగబద్ధ అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే ప్రయత్నం అని కొండా సురేఖ లేఖలో సీఎంకు కుండబద్దలు కొట్టారు.ఈ లేఖ ద్వారా వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో ఉన్న పాత గ్రూపు రాజకీయాలు మరోసారి బట్టబయలయ్యాయి. గతంలో కూడా తన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి నాపై దుష్ప్రచారం చేయించారని, ఆ కుటిల ప్రయత్నాలు విఫలమయ్యాయని సురేఖ నేరుగా సీఎంకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కడియం శ్రీహరికి పార్టీలో విపరీతమైన ప్రాధాన్యత ఇస్తూ.. కనీసం సీనియర్ మంత్రి అయిన తన శాఖలోనే జోక్యం చేసుకునేలా ప్రోత్సహించడంపై ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. దేవాదాయ శాఖ మంత్రికి సమాచారం లేకుండా ఎమ్మెల్యే ఎలా సమీక్ష నిర్వహిస్తారనే దానిపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఈ ఫిర్యాదుకు సంబంధించిన ప్రెస్ నోట్, ఫోటోలు, దినపత్రిక క్లిప్పింగులను కూడా సీఎంకు జతపరిచారు. ఒకవైపు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ సీనియర్ లీడర్లు అయిన కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య ఈ లేఖాస్త్రాల యుద్ధం ఎటు దారితీస్తుందో, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా స్పందిస్తారో అన్నది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఆర్థిక ఉగ్రవాదులు

ఉత్తమ్ కుమార్ రెడ్డి అందించిన తిరుగులేని నివేదికలు, ఆధారాలను ప్రస్తావిస్తూ కాళేశ్వరం పేరుతో తెలంగాణకు జరిగిన చారిత్రాత్మక విధ్వంసానికి మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులే ప్రత్యక్ష బాధ్యులని, ప్రజల సొమ్మును దోచుకున్న వారిని ఆర్థిక ఉగ్రవాదులు అని పిలవడంలో ఎలాంటి తప్పు లేదని సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము చేసిన ఘోర తప్పిదాలను ఇతరులపై నెట్టేసి రాజకీయ ఉనికిని కాపాడుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్ నేతల మైండ్ గేమ్‌ను ఇక సాగనిచ్చేది లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు పుట్టుపూర్వోత్తరాలను, కేసీఆర్ చేసిన రీడిజైన్ అక్రమాలను సీఎం రేవంత్ రెడ్డి విడమరిచి చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ. 39 వేల కోట్ల అంచనాతో 16.40 లక్షల ఎకరాలకు నీరందించేలా 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల' ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిందని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడే నాటికి రూ. 11,670 కోట్లు ఖర్చు చేశాక కమిషన్ల కక్కుర్తి కోసం కేసీఆర్ ఆలోచనలు మార్చారని ధ్వజమెత్తారు. రీడిజైనింగ్ కోసం 2015లో వేసిన నిపుణుల కమిటీ "మేడిగడ్డ వద్ద బ్యారేజీ వద్దు, కేసీఆర్ ఆలోచన తప్పు" అని నివేదిక ఇచ్చినా దాన్ని పక్కనపెట్టి వ్యాప్కోస్' సంస్థతో తనకు కావాల్సినట్లు తప్పుడు రిపోర్ట్ ఇప్పించుకున్నారని ఆరోపించారు. ప్రాజెక్టు ఊరు మార్చి, పేరు మార్చి అంచనాలను రూ. 81 వేల కోట్లకు, ఆపై లక్ష కోట్లకు పెంచినా అటు నీళ్లు పెరగలేదు, ఇటు ఆయకట్టు పెరగలేదని సీఎం ఎద్దేవా చేశారు.తన మేదస్సుతోనే కాళేశ్వరాన్ని డిజైన్ చేశానని కేసీఆర్ స్వయంగా డబ్బా కొట్టుకున్నారు. కానీ, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టిన చోట ఎలాంటి భూ పరీక్షలు చేయలేదు. కేసీఆర్ ఇసుకపై ఇసుక మేడల్లా బ్యారేజీలు కట్టారు" అని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. 2019 జూన్ 21న ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు కట్టిన ఏడాది నుంచే గ్రహణం పట్టిందని, నాణ్యత లోపం వల్లే కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందని సీఎం పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్నదని, వెంటనే రీస్టోర్ చేయాలని 2020లోనే నాటి ఇంజనీర్ బీవీ రమణారెడ్డి లేఖ రాసినా కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే ఇవాళ కాళేశ్వరానికి వెన్నెముక లాంటి మేడిగడ్డ కుప్పకూలే పరిస్థితికి వచ్చిందన్నారు. కనీస ప్లానింగ్, మెయింటెనెన్స్ లేకపోవడం వల్లే బ్యారేజీ దెబ్బతిన్నదని ఎన్డీఎస్ఏ నివేదిక కూడా స్పష్టం చేసిందని గుర్తు చేశారు. 9.5 ఏళ్లలో రూ. 8.21 లక్షల కోట్ల అప్పులు చేసి, కాళేశ్వరం పేరుతో రూ. 1.02 లక్షల కోట్లు బూడిదలో పోసిన పన్నీరు చేశారని మండిపడ్డారు. వర్షాలు లేక, ఎల్ నినో ప్రభావంతో నీళ్లు లేకపోయినా ఎత్తిపోసుకోవచ్చంటూ హరీష్ రావు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని సీఎం మండిపడ్డారు.ఈ ప్రాజెక్టు విధ్వంసంపై చర్చించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. చర్చకు రమ్మంటే మిడిమిడి జ్ఞానం ఉన్నవాళ్లను పంపిస్తున్నారు. కేసీఆర్ కోరుకున్న రోజు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడానికి మా ప్రభుత్వం సిద్ధం. స్పీకర్‌కు లేఖ రాసి తేదీ ఖరారు చేయండి. కేసీఆర్ గౌరవానికి భంగం కలగకుండా సభను సజావుగా నడిపే బాధ్యత నాది. ప్రాజెక్టును ఎలా బాగు చేయాలో చెబితే వచ్చే మూడేళ్ల రిపేర్ల బాధ్యత కూడా మీకే అప్పగిస్తాం అని సవాల్ చేశారు. కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలు శిక్ష అనుభవించొద్దనే ఉద్దేశంతోనే, లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్టును నిలబెట్టేందుకు తాము నిపుణులతో ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ కట్టిన సెక్రటేరియట్, ప్రజా భవన్‌లను వాడుకుంటున్నట్లే కాళేశ్వరం నిజంగా ప్రజలకు ఉపయోగపడేలా ఉంటే ఎందుకు వాడబోమని, బీఆర్ఎస్ చేసిన తప్పులకు వాళ్లను ఉరితీయాలని ప్రజలు కోరుకుంటున్నా నిబంధనలు అడ్డొస్తున్నాయని రేవంత్ రెడ్డి విమర్శించారు.

## ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

నాచారం (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నాచారంలో 20 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన బాలామృతం ప్లాంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడిన సీఎం మహిళల సాధికారత, పిల్లల ఆరోగ్యం, విద్య, పోషకాహారం, సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కీలక కార్యక్రమాలను వివరించారు.నాచారంలో ప్రారంభమైన బాలామృతం ప్లాంట్ భవిష్యత్తులో తెలంగాణ అవసరాలను తీర్చడమే కాకుండా మరో నాలుగు నుంచి ఐదు రాష్ట్రాలకు కూడా పోషకాహార ఉత్పత్తులను సరఫరా చేసే స్థాయికి ఎదుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ఆలోచనలే పునాది అని పేర్కొంటూ, చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు ఆధునిక పరిశ్రమగా అభివృద్ధి చెందిందన్నారు.గర్భిణీ మహిళల నుంచి ఆరు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని సీఎం ప్రకటించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి చిన్నారుల పోషణ అత్యంత కీలకమని, పిల్లల ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టడం అంటే రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టేనని ఆయన అన్నారు.విద్యారంగంలో కూడా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులందరికీ బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. ఆహార నాణ్యతపై ఎలాంటి అనుమానాలు లేకుండా ఉండేందుకు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కూడా విద్యార్థులతో కలిసి అదే బ్రేక్‌ఫాస్ట్, లంచ్ తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు.

దీంతో ఆహార నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.మహిళల సంక్షేమం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేశామని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా ఉద్యోగాలు, ఉపాధి కోసం ప్రయాణించే మహిళలకు ప్రతి నెలా సుమారు రూ.10 వేల వరకు ఆదా అవుతోందని చెప్పారు.ఇందిరమ్మ గృహ పథకాన్ని కూడా మహిళల సాధికారతను దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలకు మంజూరు చేశామని చెప్పారు.

# గ్రేటర్‌లో "త్రిశూల" వ్యూహం

### గ్రేటర్ టార్గెట్ పెట్టి వెళ్లిన నితిన్ నబిన్

ఇందులో భాగంగానే ఇటీవల బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అత్యంత యువ లీడర్ నితిన్ నబిన్ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా పర్యటించి, రాష్ట్ర కోర్ కమిటీ నేతలకు గట్టి వార్నింగ్ , దిశానిర్దేశం చేసి వెళ్లారు. నితిన్ నవీన్ తన అంతర్గత సమావేశాల్లో రాష్ట్ర నేతలకు అత్యంత స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. పట్టణ ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ సిటీలు ఎప్పుడూ బీజేపీకి బలమైన కోటలు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ చుట్టుపక్కల ఎంపీ స్థానాలు గెలిచినంత మాత్రాన సరిపోదు ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో మన సత్తా చాటకపోతే, తెలంగాణలో అధికారం చేపడతామనే బీజేపీ కల భవిష్యత్తులో కేవలం కలగానే మిగిలిపోతుంది అని ఆయన కుండబద్దలు కొట్టారు. నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కనబెట్టి, కలిసికట్టుగా పోరాడకపోతే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

### మూడు ముక్కల వ్యూహం - మూడు సవాళ్లు

గ్రేటర్‌ను విభజించడం వెనుక కాంగ్రెస్ పొలిటికల్ స్కెచ్ ఉంది. ఓల్డ్ సిటీ పరిధిలోని హైదరాబాద్ , ఐటీ కారిడార్ ఉన్న సైబరాబాద్ , ఉద్యోగులు–మధ్యతరగతి ఎక్కువగా ఉండే మల్కాజ్‌గిరి, ఈ మూడింటికీ వేర్వేరు వ్యూహాలు కావాలని నితిన్ నవీన్ స్పష్టం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలకు ఇవి కేవలం మున్సిపల్ ఎన్నికలు కావు వారి సొంత రాజకీయ భవిష్యత్తును, ఉనికిని చాటుకోవడానికి ఒక అగ్నిపరీక్ష. అందుకే జాతీయ అధ్యక్షుడి పర్యటన ముగిసిన వెంటనే తెలంగాణ బీజేపీ నేతలంతా గ్రేటర్ మున్సిపల్ పరిధిపై అంతర్గత కసరత్తు తీవ్రం చేశారు. గత 2020 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 48 స్థానాలు గెలుచుకుని బీఆర్ఎస్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పుడు బీఆర్ఎస్ బాగా బలహీనపడిన తరుణంలో ఆ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు వెళ్లకుండా పూర్తిగా తమ వైపు తిప్పుకోవడమే బీజేపీ ముందున్న అసలైన టాస్క్.

### డివిజన్ల వారీగా వ్యూహం

కొత్తగా ఏర్పడిన సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలో ఐటీ ఉద్యోగులు, వలస ప్రజలు, ఇతర రాష్ట్రాల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ సెగ్మెంట్ సాంప్రదాయకంగా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఇష్టపడుతుంది కాబట్టి, ఇక్కడ క్షేత్రస్థాయిలో సరైన అభ్యర్థులను నిలబెడితే మేజర్‌గా లాభపడొచ్చని బీజేపీ భావిస్తోంది. ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు బూచీని చూపిస్తూ గ్రేటర్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసే పనిలో బీజేపీ శ్రేణులు నిమగ్నమయ్యాయి.

### జాతీయ నాయకత్వానికీ ముఖ్యమే

ఈ త్రిముఖ కార్పొరేషన్ పోరు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ గమనాన్ని మార్చనుంది. కాంగ్రెస్ అధికార బలాన్ని, వ్యూహాలను తట్టుకుని నిలబడాలంటే బీజేపీ కేవలం సోషల్ మీడియా పాలిటిక్స్ నమ్ముకుంటే సరిపోదు క్షేత్రస్థాయిలో రోడ్ల పైకి వచ్చి పోరాడాల్సి ఉంటుంది. జాతీయ నాయకత్వం పంపిన అల్టిమేటంతో అప్రమత్తమైన తెలంగాణ బీజేపీ లీడర్లు ఈ ఎన్నికలను జీవన్మరణ సమస్యగా భావించి సరికొత్త కార్యాచరణతో ముందుకు కదులుతున్నారు. ఒకవేళ ఈ మూడు స్థానాల్లో బీజేపీ మెజారిటీ సాధిస్తే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకునే గోల్డెన్ ఛాన్స్ దక్కుతుందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ

రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 11 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,076.11 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. దీంతో 10,531 ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయని వెల్లడించారు. కాగా, ఇదే సమయంలో చంద్రబాబు కీలక సూచనలు చేసారు. ఇథనాల్ బ్లెండింగ్ 40 శాతానికి పెంచితే, మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇథనాల్ తయారీ రంగంలో వచ్చే అన్ని పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. పెట్రోలు, డీజిల్‌లో మిక్స్ చేసేందుకు ఇథనాల్ భారీగా అవసరం కానుందన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి పాలసీ తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్దేశించారు.'పర్యాటకరంగంలో అపార అవకాశాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. తిమ్మమ్మ మర్రిమాను సహా రాష్ట్రవ్యాప్తంగా 100 టూరిస్ట్ స్పాట్‌ల దగ్గర ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలవరం, దిండి, గండికోట, కంబం చెరువు, లంబసింగి లాంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. లంబసింగి, అరకు సమీపంలో రిసార్ట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేస్తోందని చెప్పారు. ఏటికొప్పాక, కొండపల్లి , ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడ, పొందూరు కళారూపాల్ని కూడా తీర్చిదిద్దాలని సూచించారు. ఇందుకోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అవసరమైన హోటల్ గదులు పెద్దఎత్తున వస్తున్నాయని సీఎం చెప్పారు. సోలార్ సెల్స్‌లో ఏపీ అగ్రగామిగా నిలవాలన్నారు. ఇంకా ఏర్పాటు చేయాల్సిన 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని నిర్దేశించారు.

### ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టుల వివరాలు:

1. డీఎస్ఆర్ హాస్పిటాలిటీ: నెల్లూరులో రూ.139.92 కోట్లతో 4–స్టార్ హోటల్ (180 మందికి ఉపాధి).
2. మాధవి లీజర్ అండ్ స్టేస్: కడపలో రూ.52.10 కోట్లతో 3–స్టార్ హోటల్ (400 మందికి ఉపాధి).
3. శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్: కడపలో రూ.68.69 కోట్లతో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ (690 మందికి ఉపాధి).
4. వజ్ర హాస్పిటాలిటీ: విజయవాడలో రూ.62.40 కోట్లతో హోటల్, బ్యాంక్వెట్ సెంటర్ (450 మందికి ఉపాధి).
5. నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్: తిరుపతి జిల్లాలో రూ.255 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (400 మందికి ఉపాధి).
6. అక్షత్ గ్రీన్‌టెక్: అనకాపల్లి జిల్లాలో రూ.1,600 కోట్లతో సోలార్ సెల్, మాడ్యూల్ యూనిట్ (750 మందికి ఉపాధి).
7. బెర్రీ అలాయ్స్: బొబ్బిలిలో రూ.1,200 కోట్లతో మాంగనీస్ సిన్టర్ ప్లాంట్ (831 మందికి ఉపాధి).
8. జియో మైసూర్ ఇండియా: కర్నూలు జిల్లా తుగ్గలిలో రూ.689 కోట్లతో స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ (1,750 మందికి ఉపాధి).
9. ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్ (గూగుల్ వేర్‌హౌస్ పార్ట్‌నర్స్): విశాఖలో రూ.1,008 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (5,000 మందికి ఉపాధి).
10. అదానీ ఫౌండేషన్: విశాఖ జిల్లా కపులుప్పాడలో రూ.2,200 కోట్ల ప్రాజెక్టు.
11. మోండెలీజ్ ఇండియా ఫుడ్స్: శ్రీ సిటీలో రూ.1,801 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ (80 మందికి ఉపాధి).

# సీఎం పర్యటనలను మేము నియంత్రించాలా.?

డీఎంకేను హెచ్చరించింది. అయితే, ఈ కేసులో విజయ్ కూడా నిందితుడేనని డీఎంకే తరఫు లాయర్ వాదించారు. సీబీఐ విచారణ జరుగుతున్నందున ఆయన సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని అన్నారు. కానీ, దీనిపై నమోదుచేసిన రెండు ఎఫ్ఐఆర్‌లలో విజయ్‌ని నిందితుడిగా పేర్కొనలేదని చెబుతూ పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టేసింది.జులై 10న కరూర్‌లో పర్యటించనున్న తమిళనాడు సీఎం విజయ్ మృతుల కుటుంబాలను కలిసి ఓదార్చనున్నారు. వారికి కారుణ్య నియామకాలు, ఆర్థిక సహాయం అందజేయనున్నారు.

ఈ నేపథ్యంలోనే విజయ్ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దని ప్రతిపక్ష డీఎంకే సుప్రీం కోర్టుకు వెళ్లింది. గతేడాది సెప్టెంబరులో విజయ్ కరూర్ పర్యటన సందర్భంగా తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.కాగా, కరూర్ తొక్కిసలాటపై 'లెక్క తేల్చుకోవాలి' అని తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత, మంత్రి ఆదవ్ అర్జున జులై 2న చేసిన ప్రకటనలో పేర్కొన్నారని ఆరోపిస్తూ, ప్రతిపక్ష పార్టీ కూడా ఆయనపై అభ్యంతరం వ్యక్తం చేసింది. తొక్కిసలాట జరిగిన సమయంలో అధికారంలో ఉన్న డీఎంకే, 'పోలీసుల ద్వారా కరూర్ ప్రజలను చంపేసింది' అని ఆయన అన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మార్చిలో సీబీఐ విచారణకు విజయ్ హాజరయ్యారు. తొక్కిసలాట జరిగిన ఒక నెల తర్వాత, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఈ విచారణను చేపట్టింది. ఈ సమయంలో టీవీకే "మా నాయకుడు విచారణకు సహకరిస్తారు. దీనివల్ల నిజం బయటపడుతుందని మేము ఆశిస్తున్నాం" అని ప్రకటన చేసింది. అయితే, కుట్రపూరితంగా అప్పుడు అధికారంలో ఉన్న డీఎంకే సరైన భద్రత చర్యలను చేపట్టలేదని టీవీకే ఆరోపిస్తోంది.

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**- తిలక్ పాఠశాలలో మిడ్‌డే మీల్స్‌ను ఆకస్మికంగాతనిఖీ చేసిన ఎమ్మెల్యే అరవింద బాబు**



**నరసరావుపేట** నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న తిలక్ ప్రభుత్వ పాఠశాలలో మిడ్‌డే మీల్స్ (మధ్యాహ్న భోజన పథకం) అమలును స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా పాఠశాలలోని భోజనాల గది, నిల్వ గదులను పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, భద్రత, నిల్వ విధానాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టిక ఆహారం అందుతున్నదని నిర్ధారించుకున్న అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేసి, భోజనం గురించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న కొత్త పాఠశాల యూనిఫామ్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలలో ఇటీవల ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పి–4 విధానంలో దాతల సహకారంతో అదనపు కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించే అంశాలపై పాఠశాల నిర్వహణ కమిటీతో ఎమ్మెల్యే వివరణాత్మకంగా చర్చించారు. త్వరలోనే అన్ని వసతులతో కూడిన ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జి భూమిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కపిలవాయి విజయ్ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, మెహర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

**సికింద్రాబాద్** మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దంపతులు ప్రత్యేక ఓటరు సవరణ (సాఎఖీ) కార్యక్రమంలో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ లోని నివాసంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యుల వివరాలు బీఎల్వో, ఇతర అధికారులు సేకరించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పూర్తి వివరాలతో కూడిన ఎన్యుమరేటర్ పత్రాన్ని అధికారులకు సమర్పించారు.

## అక్రమంగా తరలిస్తున్న పొగాకు బేళ్లను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు.



జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డు విజిలెన్స్ అధికారులకు అందిన ముందస్తు సమాచారం మేరకు, జంగారెడ్డిగూడెం నుండి గుంటూరుకు అక్రమంగా రవాణా అవుతున్న పొగాకు బేళ్లను అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు.నమ్మదగిన సమాచారంతో నిఘా ఉంచిన అధికారులు, అనుమానాస్పదంగా వెళ్తున్న ×రెండు ఆటోలను× ఆపి కలపర్రు టోల్ ప్లాజా వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతులు (పర్మిట్లు) లేకుండా అక్రమంగా తరలిస్తున్న సుమారు ×32 హై గ్రేడ్ పొగాకు బేళ్లను× గుర్తించి, వాటిని తక్షణమే సీజ్ చేశారు.ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం సీజ్ చేసిన పొగాకును జంగారెడ్డిగూడెం వేలం కేంద్రానికి తరలించారు.

## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ప్రారంభం

### సీపీ గౌష్ ఆలం






కరీంనగర్ తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 3వ జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్?2026 జూలై మంగళవారం, నేడు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించబడుతున్నాయని సీపీ తెలిపారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.ఈ డ్యూటీ మీట్‌లో జోన్–3 పరిధిలోని కరీంనగర్, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన మొత్తం 91 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారన్నారు. యూనిట్ వారీగా కరీంనగర్ నుంచి 24 మంది, సిద్ధిపేట నుంచి 19 మంది, రాజన్న సిరిసిల్ల నుంచి 21 మంది, కామారెడ్డి నుంచి 13 మంది, మెదక్ నుంచి 14 మంది హాజరవుతున్నారని తెలిపారు.ఈ డ్యూటీ మీట్ పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సమర్థవంతమైన సేవల అందింపులో మరింత నైపుణ్యం సాధించేందుకు వేదికగా నిలవనుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా శాస్త్రీయ దర్యాప్తు యాంటీ సబోటేజ్ చెక్, డాగ్ స్క్వాడ్ పోటీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ అంశాల్లో పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని మల్టీ జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారని సీపీ తెలిపారు.పోటీల్లో విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాల ప్రకారం బంగారు పతక విజేతలకు రూ.3 లక్షలు, మూడు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, వెండి పతక విజేతలకు రూ.2 లక్షలు, రెండు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, కాంస్య పతక విజేతలకు రూ.1 లక్ష, ఒక అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్ అందజేయబడతాయి. అలాగే జట్టు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు కూడా అందజేయనున్నారని అన్నారు.ఈ డ్యూటీ మీట్‌ను కేవలం పోటీగా కాకుండా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశంగా భావించి, క్రమశిక్షణ, అంకితభావం, సేవా తత్వంతో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఈ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, సమన్వయం మరింత బలోపేతమై ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, వెంకటస్వామి, ఇతర జిల్లాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసిన

## – పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస (ప్రశ్న న్యూస్) గౌతు శిరీష థమీమ్ అన్సారియా ఎ., ఐ.ఏ.ఎస్., పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ని విద్యా భవన్, ఆత్మకూరు (వి), మంగళగిరి (ఎం), గుంటూరు జిల్లాలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలాస నియోజకవర్గానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై వినతిపత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా పలాస మున్సిపాలిటీ పరిధిలో యువతకు మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించి క్రీడలను ప్రోత్సహించేందుకు మినీ స్టేడియం నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే బుడార్సింగి పీఎం జన్మన్ హాస్టల్ ప్రారంభమైన నేపథ్యంలో, ఆ ప్రాంతానికి చెందిన 81 మంది గిరిజన విద్యార్థులు ప్రతిరోజూ సుమారు 8 కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బుడార్సింగి పీఎం జన్మన్ హాస్టల్ ప్రాంగణంలోనే పాఠశాల ఏర్పాటు చేయాలని డైరెక్టర్ ని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల విద్యా హక్కును పరిరక్షించే దిశగా ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

# పోలవరం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన : మంత్రి నిమ్మల

**నిర్దేశిత గడువు 2027 లోపలే పోలవరం పూర్తి,**

**షెడ్యూల్ ప్రకారమే చకచకా పనులు**

**రేపు పట్టిసీమ, తాటిపూడి పంప్ హౌస్ ల మోటార్లు ఆన్ చేస్తున్నాం**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు పనులు ఆశించిన రీతిలో షెడ్యూల్ ప్రకారమే జరుగుతున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. మంగళవారం ఆయన ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం 2027 పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తాము పెట్టుకున్న లక్ష్యానికి అనుగుణంగా షెడ్యూల్ ప్రకారం ప్రతి పని పక్కాగా జరుగుతోందన్నారు. 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తి కాగా 2019- 24 మధ్య 5 ఏళ్ల వైకాపా హయాంలో కేవలం రెండు శాతం మాత్రమే తూతూ మంత్రంగా జరిగాయన్నారు. టిడిపి ప్రభుత్వం హయంలో చేసిన పనులకు కేంద్రం నుండి వచ్చిన రియంబర్స్మెంట్ నిధులను కూడా దారి మళ్లించేసిన నీచ చరిత్ర జగన్ ది అన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో 15శాతం పోలవరం పనులు పూర్తి చేశామన్నారు. జగన్ హయాంలో ధ్వంసం, విధ్వంసం కారణంగా పాడైన డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్త డయాఫ్రమ్ వాల్ ను 990 కోట్ల రూపాయల వ్యయంతో 440 రోజుల్లో పూర్తి చేయడం తమ ప్రభుత్వ సమర్థతకు, చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు.ఎగువ కాపర్ డ్యాం పట్టిష్టానికి, సీపేజీ అరికట్టడానికి ఉద్దేశించిన బట్రస్ డ్యాం 100 శాతం పూర్తి చేసామని రామానాయుడు చెప్పారు. దీనివల్ల వర్షాకాలంలో కూడా పనులు ఆగవన్నారు.ఈకార్యక్రమంలో జలవనరుల శాఖ సలహదారులు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, గోదావరి డెల్టా సిఈ చిన్నబాబు, పోలవరం ఎస్ఈ రామచంద్రరావు, మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులు సతీష్ బాబు, గంగాధర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# గరుడవాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చిన శ్రీ సుందరరాజస్వామివారు

**వైభవంగా ముగిసిన మూడు రోజుల అవతార మహోత్సవాలు**

**– తిరుచానూరులో భక్తుల సందడి**



తిరుపతి(ప్రశ్న న్యూస్) తిరుచానూరులోని శ్రీ సుందరరాజస్వామివారి మూడు రోజుల అవతార మహోత్సవాలు మంగళవారం రాత్రి గరుడవాహన సేవతో అత్యంత వైభవంగా ముగిశాయి. గరుడవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించిన స్వామివారు భక్తులకు దివ్య దర్శనం, అభయానుగ్రహం ప్రసాదించారు. మహోత్సవాల చివరి రోజున మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామివారి ముఖ మండపంలో శ్రీ సుందరరాజస్వామివారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, చందనంతో మహాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య జరిగిన ఈ అభిషేక సేవ భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. అనంతరం సాయంత్రం శ్రీకృష్ణస్వామివారి ముఖ మండపంలో ఊంజల్ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి గరుడవాహనంపై స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనం కల్పించగా, “గోవింద... గోవింద...” నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఈ గరుడవాహన సేవను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కృపాకటాక్షాలను పొందారు. మూడు రోజుల పాటు నిర్వహించిన అవతార మహోత్సవాలు భక్తిపారవశ్య వాతావరణంలో శాస్త్రోక్తంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, అర్చకులు బాబుస్వామి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# దక్షిణ కైలాసం శ్రీకాళహస్తి పంచభూతాల్లో వాయువుకు ప్రతీకగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరుడు

**– జ్ఞాన ప్రసూనాంబ కటాక్షం, భక్త కన్నప్ప త్యాగం,పాతాళ వినాయకుడి మహిమ**

**– సువర్ణముఖి తీరాన శాశ్వత ఆధ్యాత్మిక వైభవం**



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి ఈ పేరు వినగానే శివభక్తులకు గుర్తుకు వచ్చేది పంచభూత లింగాల్లో వాయు లింగంగా వెలుగొందుతున్న శ్రీకాళహస్తీశ్వర స్వామి. తిరుపతికి సమీపంలో, సువర్ణముఖి నది ఒడ్డున కొలువైన ఈ పుణ్యక్షేత్రం వేల ఏళ్ల చరిత్ర, పురాణ వైభవం, అద్భుత శిల్పకళ, అపారమైన ఆధ్యాత్మిక శక్తితో ప్రపంచవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తోంది. ఈ క్షేత్రాన్ని “దక్షిణ కైలాసం”గా కూడా పిలుస్తారు.



### శ్రీకాళహస్తి అనే పేరు ఎలా వచ్చింది.?

పురాణాల ప్రకారం ఒక సాలీడు (శ్రీ) తన గూడుతో శివలింగాన్ని రక్షించేది. పాము (కాల) తన నాగమణిని సమర్పించి పూజించేది. ఏనుగు (హస్తి) ప్రతిరోజూ నదిలో నుంచి నీటిని తీసుకొచ్చి అభిషేకం చేసేది. ముగ్గురూ తెలియక ఒకరి పూజను మరొకరు తొలగించేవారు. చివరికి భక్తిని పరీక్షించిన పరమశివుడు ముగ్గురికీ మోక్షం ప్రసాదించాడు. వారి పేర్లైన శ్రీ ం కాల ం హస్తి కలిపి శ్రీకాళహస్తి అనే పేరు ఏర్పడిందని స్థల పురాణం చెబుతోంది.

### పంచభూత లింగాల్లో వాయు లింగం

భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం అనే పంచభూతాల్లో గాలికి ప్రతీకగా శ్రీకాళహస్తీశ్వరుడు ఆరాధింపబడుతున్నాడు. గర్భగుడిలో గాలి ప్రవేశించని పరిస్థితుల్లో కూడా స్వామివారి సమీపంలో వెలిగే దీపజ్యోతి నిరంతరం కదులుతూ ఉండటం భక్తులను ఆశ్చర్యపరుస్తుంది. దీనినే వాయు తత్వానికి సంకేతంగా భావిస్తారు. ఈ కారణంగానే ఈ ఆలయానికి దేశ విదేశాల నుంచి భక్తులు తరలివస్తుంటారు.

### జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి వైభవం

శ్రీకాళహస్తి క్షేత్రంలో స్వామివారికి సమానంగా పూజలు అందుకునే అమ్మవారు శ్రీ జ్ఞాన ప్రసూనాంబ. “జ్ఞానాన్ని పుష్పంలా వికసింపజేసే తల్లి” అనే అర్థంతో ఈ నామం ప్రసిద్ధి చెందింది. విద్య, జ్ఞానం, ఆధ్యాత్మిక చైతన్యం కోరుకునే భక్తులు అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకుంటారు. నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. శివశక్తుల అభేదానికి ఈ ఆలయం ప్రతీకగా నిలుస్తుంది.

### భక్త కన్నప్ప - భక్తికి నిలువెత్తు నిదర్శనం



శ్రీకాళహస్తి అంటే భక్త కన్నప్పను ప్రస్తావించకుండా కథ పూర్తికాదు. వేటగాడైన తిన్నడు శివుడిపై అపారమైన ప్రేమతో తనకు తెలిసిన విధంగానే పూజించేవాడు. తన నోటితో తెచ్చిన నీటితో అభిషేకం చేసి, వేటలో దొరికిన మాంసాన్ని నైవేద్యంగా సమర్పించేవాడు. శివలింగం కన్ను నుంచి రక్తం కారుతుండటాన్ని చూసి తన కన్నును తీసి సమర్పించాడు. రెండో కన్నును కూడా అర్పించబోతుండగా పరమశివుడు ప్రత్యక్షమై “కన్నప్పా” అని పిలిచి మోక్షం ప్రసాదించాడు. నేటికీ కన్నప్ప కొండ, కన్నప్ప ఆలయం భక్తులను ఆ భక్తి వైభవాన్ని గుర్తు చేస్తుంటాయి.

### పాతాళ వినాయకుడు - భూగర్భంలో విఘ్నేశ్వరుడు

శ్రీకాళహస్తి ఆలయంలోని ప్రత్యేక ఆకర్షణల్లో పాతాళ వినాయకుడు ఒకరు. భూమికి దిగువన ఉన్న ఈ ఆలయానికి మెట్లు దిగి వెళ్లి స్వామిని దర్శించాలి. సుమారు 30 అడుగుల లోతులో ఉన్నట్లు చెబుతారు. ఏ శుభకార్యానికైనా ముందు వినాయకుడిని దర్శించడం ఆనవాయితీగా భావించే భక్తులు ఇక్కడ కూడా ముందుగా పాతాళ వినాయకుడిని దర్శించుకుని తరువాత శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శిస్తారు.

### శిల్పకళకు చిరస్మరణీయ నిదర్శనం

శ్రీకాళహస్తి ఆలయం ద్రావిడ శిల్పకళకు అపూర్వ ఉదాహరణ. ముఖ్యంగా విజయనగర సామ్రాజ్య కాలంలో ఆలయం విశేషంగా అభివృద్ధి చెందింది.ఆలయంలోని శిల్పకళ విశేషాలుఅద్భుతమైన రాజగోపుర నిర్మాణ శైలి.వందలాది శిలా స్తంభాలపై దేవతలు, గంధర్వులు, నర్తకులు, యోధుల శిల్పాలు.యాళి, సింహం, ఏనుగు, గుర్రాల శిల్పాల అద్భుత చెక్కుదనం.మండపాల్లో పురాణ ఘట్టాలను ప్రతిబింబించే శిల్పాలు.శిల్పాల్లో సూక్ష్మమైన ఆభరణాల రూపకల్పన.విజయనగర కళా వైభవానికి ప్రతీకగా నిలిచే స్తంభ నిర్మాణం.ఆలయంలోని ప్రతి మండపం ప్రత్యేక శిల్ప సంపదకు నిలయం.

### సువర్ణముఖి నది - క్షేత్రానికి జీవనాడి

శ్రీకాళహస్తి క్షేత్రం సువర్ణముఖి నది తీరాన వెలసింది. పురాణాల ప్రకారం ఈ నది మహర్షి అగస్త్యుని తపస్సుతో ఉద్భవించిందని విశ్వాసం. స్వర్ణంలా ప్రకాశించే ఇసుక కారణంగా దీనికి “సువర్ణముఖి” అనే పేరు వచ్చిందని చెబుతారు. ఈ నది జలాలతో శివలింగానికి అభిషేకం చేయడం అత్యంత పుణ్యప్రదంగా భావిస్తారు. యాత్రికులు నదిలో స్నానం చేసి స్వామివారిని దర్శించడం ఆనవాయితీ.

### ఆలయ చరిత్ర

పల్లవులు, చోళులు, యాదవరాయలు, ముఖ్యంగా విజయనగర రాజులు ఈ ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేశారు. శ్రీకృష్ణదేవరాయలు ఆలయంలో అనేక మండపాలు, గోపురాలు నిర్మించి క్షేత్ర వైభవాన్ని మరింత పెంచారు. శాసనాలు, శిల్పాలు, నిర్మాణ శైలి ఆలయ చారిత్రక ప్రాధాన్యాన్ని తెలియజేస్తాయి.

### నిత్య పూజలు - విశిష్ట ఉత్సవాలు

ప్రతిరోజూ సుప్రభాతం, అభిషేకం, అర్చనలు, మహామంగళహారతి నిర్వహిస్తారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, కార్తీక దీపోత్సవాలు, నవరాత్రులు, ప్రత్యేక రాహు-కేతు పూజలు అత్యంత వైభవంగా జరుగుతాయి. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు ఈ సందర్భంగా తరలివస్తారు.

### శ్రీకాళహస్తి ప్రత్యేకతలు

- పంచభూత లింగాల్లో వాయు లింగం.
దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి.
భక్త కన్నప్ప మోక్షం పొందిన క్షేత్రం.
జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి శక్తిపీఠ సమాన ప్రాధాన్యం.
పాతాళ వినాయకుడి అరుదైన భూగర్భ ఆలయం.
రాహు--కేతు పూజలకు ప్రపంచ ప్రసిద్ధి.
విజయనగర శిల్పకళకు అద్భుత నిదర్శనం.
సువర్ణముఖి నది తీరాన వెలసిన మహాక్షేత్రం.
శ్రీకాళహస్తి కేవలం ఒక శివాలయం మాత్రమే కాదు. ఇది భక్తి, శిల్పకళ, పురాణం, చరిత్ర, ఆధ్యాత్మికత, ప్రకృతి అన్నీ కలిసిన మహాక్షేత్రం. వాయు లింగంగా ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి పొందిన ఈ దేవస్థానం ప్రతి భక్తునికి ఆత్మశాంతిని, దైవానుభూతిని అందించే దక్షిణ భారతదేశంలోని అత్యంత విశిష్ట శైవ క్షేత్రాలలో ఒకటిగా చిరస్థాయిగా నిలిచిపోయింది.

# బ్రహ్మోత్సవాల నాటికి తిరుమలలో పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులు: అదనపు ఈవో

**– భక్తులకు ఆధునిక రవాణా సౌకర్యాలపై టీటీడీ దృష్టి**

**– రిలయన్స్ బృందంతో అదనపు ఈవో సమీక్ష**



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల నాటికి తిరుమలలో పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్. వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. రిలయన్స్ సంస్థ టీటీడీకి విరాళంగా అందిస్తున్న 25 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, డ్రైవర్ల నియామకం తదితర అంశాలపై తిరుమల పద్మావతి అతిథిగృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో రిలయన్స్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ, భక్తులకు సౌకర్యవంతమైన, పర్యావరణహిత రవాణా సేవలు అందించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. ప్రస్తుతం నడుస్తున్న 15 బస్సులకు అదనంగా మరో 25 బస్సులు చేరనున్న నేపథ్యంలో, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 50 బస్సుల సామర్థ్యంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో టీటీడీ ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు, ఐటీ జీఎం వెంకటేష్ నాయుడు, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్, ట్రాన్స్‌పోర్ట్ డీఎం లక్ష్మీ ప్రసన్న, రిలయన్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ గణేశన్, సీనియర్ జనరల్ మేనేజర్లు రాఘవేంద్ర, వినోద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# చిరస్మనీయుడు వైయస్సార్

రాయచోటి ,ఇది కేవలం ఒక మహానేత జయంతి మాత్రమే కాదు, పేదవాడి ఆశలు, రైతన్న నమ్మకం, విద్యార్థి భవిష్యత్తు, ప్రజా సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన మహోన్నత వ్యక్తిత్వాన్ని స్మరించుకునే పవిత్రమైన రోజు అని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటిలో శ్రీకాంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల మధ్య పుట్టి, ప్రజల కోసమే జీవించి, ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించిన నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. అధికారం అంటే ప్రజలకు సేవ చేయడమేనని తన పాలన ద్వారా నిరూపించిన అపూర్వ ప్రజానాయకుడు వైఎస్ఆర్ అని అన్నారు.రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, జలయజ్ఞం ద్వారా సాగునీటి విప్లవం, పేదలకు ఆరోగ్యశ్రీ, 108, 104 అత్యవసర వైద్య సేవలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు ఇందిరమ్మ గృహాలు, మహిళలు, వృద్ధులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలు,మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు భారత సంక్షేమ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయాయని తెలిపారు. ప్రజల కష్టాలను చూసి కదిలిన హృదయం వైఎస్ఆర్... రైతు కన్నీటిని తుడిచిన చేయి వైఎస్ఆర్... పేదవాడి ఇంట్లో ఆశదీపం వెలిగించిన నాయకుడు వైఎస్ఆర్.సంక్షేమాన్ని ప్రభుత్వ విధానంగా మార్చిన మహానేత వైఎస్ఆర్వైఎస్ఆర్ ఒక పేరు కాదు పేదల గుండెల్లో చెరగని నమ్మకం..వైఎస్ఆర్ ఒక వ్యక్తి కాదు.తరతరాలకు స్ఫూర్తినిచ్చే మహోన్నత శక్తి అని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి ప్రాంతంపై వైఎస్ఆర్‌కు ఉన్న ప్రత్యేక మమకారం కారణంగానే తాగునీటి పథకాలు, రింగ్ రోడ్డు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇతర విద్యాసంస్థలు, సాగునీటి ప్రాజెక్టులు, పలు అభివృద్ధి కార్యక్రమాలు సాకారమయ్యాయని గుర్తు చేశారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



నరసరావుపేట, పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలో కొత్తపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. నరసరావుపేటకు చెందిన కృష్ణవేణి డిగ్రీ కాలేజీ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య 15వేల రూపాయలు విలువ చేసే నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిల్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రాథమిక విద్య నుండి ఉపాధ్యాయులు చెప్పిన విద్యాబోధనలను శ్రద్ధగా విని, బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీష్మారావు, విశ్రాంత ఉపాధ్యాయులు కోమటినేని వెంకటేశ్వర్లు, నవచైతన్య, ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావు, ఇమామ్ ఖాశిం సైదులు , శ్రీ లక్ష్మీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఏపి రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మణి ఎన్నిక



చిట్వేలి ఏలూరు జిల్లాలో జూలై 3, 4, 5 తేదీల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి ఈ మహాసభల సందర్భంగా చిట్వేలి ప్రాంతానికి చెందిన పందికాళ్ళ మణి ని రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పందికాళ్ళ మణి తెలిపారు. చిట్వేలి లో మణి మాట్లాడుతూ జిల్లాలో వరి, వేరుశనగ తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పండ్ల తోటలకు పేరుగాంచిన రైల్వే కోడూరు ప్రాంతంలో బొప్పాయి, మామిడి, అరటి పంటలు ఎక్కువగా పండిస్తారని గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని అన్నారు. ఈ సంవత్సరం ధరలు లేక తోతాపురి రకం కాయలను తోటలోనే చెట్లకు వదిలేయడం చాలా బాధాకరమని అన్నారుప్రభుత్వ స్పందించి పండ్ల తోటలకు గిట్టుబాటు ధర, హార్టికల్చర్ హబ్ గా మార్చి కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీకి, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# డబుల్ మర్డర్ కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**- తప్పు చేసినవారెవరైనా చట్టం నుండి తప్పించుచుకోలేరు**

**- జిల్లా ఎస్పీ : మహేష్ బి గితే**

**- డబుల్ మర్డర్ కేసును ఛేదించిన పోలీసులకు ఎస్పీ ప్రశంసలు**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు హత్య కేసుల్లో నిందితుడు వంగా సందీప్ రెడ్డికి సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ మంగళవారం జీవిత ఖైదు (యావజ్జీవ కారాగార శిక్ష) విధించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు. 2018లో కొత్తపల్లి గ్రామానికి చెందిన బీనబోయిన దేవయ్యను భూ వివాదం నేపథ్యంలో కత్తితో హత్య చేసిన కేసుతో పాటు, 2022లో కామారెడ్డి జిల్లాకు చెందిన మన్నె నరసింహులను గొడ్డలితో హత్య చేసిన కేసులో వంగా సందీప్ రెడ్డి నిందితుడిగా తేలాడు. ఈ రెండు కేసుల్లో పోలీసులు సమర్పించిన శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. విచారణలో 20 మంది సాక్షులను ప్రవేశపెట్టగా, అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంటా శ్రీనివాస్ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, అప్పటి, ప్రస్తుత సీఐలు మొగిలి, బన్సీలాల్, వెంకటేష్, గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్ సమన్వయంతో కేసు విచారణ సాగింది. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని, పోలీసులు--ప్రాసిక్యూషన్ సమన్వయంతో పకడ్బందీగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ కేసుల్లో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, అప్పటి పీపీ పెంటా శ్రీనివాస్, ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు మొగిలి, బన్సీలాల్, వెంకటేష్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# కీసరలో ఘనంగా ఆర్ పి ఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

**- మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు**




కీసర( ప్రశ్న న్యూస్) కీసర మండల కేంద్రంలో ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షుడు బక్కని కుమార్ మాదిగ ఆధ్వర్యంలో 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి, మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీపీ రామారం సుజాత మాట్లాడుతూ, 32 ఏళ్ల ఉద్యమ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో రాణించాలని సూచించారు. మండల ఇంచార్జ్ బుడిగే జగన్ మాదిగ మాట్లాడుతూ, విద్య ద్వారానే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని, ఎస్సీ వర్గీకరణ ప్రయోజనాలను విద్య, ఉపాధి రంగాల్లో వినియోగించుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త శ్రీనివాస్, పూంద్రు కృష్ణ, పూంద్రు మల్లేష్, చినింగని శ్రీనివాస్, మొరుగు రామలింగం, పూంద్రు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల నివారణకు పోలీసు -వ్యవసాయ శాఖ సంయుక్త తనిఖీలు

**- బోయినిపల్లి పరిధిలో నకిలీ విత్తనాలు గుర్తించలేదు**

**- వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : శ్రీనివాస్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు మంగళవారం పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్సై కె. గంగరాజు, మండల వ్యవసాయ అధికారి కె. ప్రణీత ఆధ్వర్యంలో బూరుగుపల్లిలోని కల్లెపల్లి చంద్రయ్య ఎరువుల దుకాణం, మదురవెల్లి జాన్ ఎరువుల దుకాణం, కొదురుపాకలోని ఓం సాయి ఫర్టిలైజర్స్ షాప్‌తో పాటు సీఎస్ఈ వీఎల్ఈ సొసైటీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీల్లో ఎక్కడా నకిలీ విత్తనాలు లేదా అనుమానాస్పద నిల్వలు గుర్తించలేదని, సంబంధిత రికార్డులను కూడా సంపూర్ణంగా పరిశీలించినట్లు వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు.

# మహానేత వైఎస్సార్ 77వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

**- వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేయాలి**

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు : మల్లెల లక్ష్మణ్**



భీంగల్ (ప్రశ్న న్యూస్)ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి సందర్భంగా జూలై 8న ( నేడు బుధవారం) ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు భీంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెల లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలం సంక్షేమ పాలనకు స్వర్ణయుగమని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108--104 అంబులెన్స్ సేవలు, జలయజ్ఞం ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇళ్లు, పావలా వడ్డీ రుణాలు, రూపాయికే కిలో బియ్యం వంటి పథకాల ద్వారా పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళల జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని తెలిపారు. 2003లో చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని, ముఖ్యమంత్రిగా వాటికి పరిష్కారాలు చూపారని కొనియాడారు. వైఎస్సార్ ఆశయ సాధనలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త భాగస్వామి కావాలని,నేడు నిర్వహించే ఆయన జయంతి వేడుకలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని మల్లెల లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

**- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి మూడు రోజుల జైలు శిక్ష**

**- భీంగల్ సబ్ ఇన్స్పెక్టర్ : తిరుపతి**



భీంగల్ ( ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,భీంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి ఆర్మూర్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి (సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్) మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు భీంగల్ ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకూడదని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# రాజన్నాలయ ఉద్యోగ నియామకాలపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

**- స్థానికేతరులకు ఉద్యోగాలివ్వొద్దు**

**- శ్రావణం నుంచే రాజన్న దర్శనం కల్పించాలి.. లేకుంటే వేములవాడ బంద్ కు పిలుపునిస్తాం**

**- బీజేపీ వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, రాజన్న ఆలయంలో ఉద్యోగ నియామకాల విషయంలో నిబంధనలను ఉల్లంఘించి స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారనే వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఆలయ అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్నప్పటికీ వారికి అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. నియామకాలలో జరిగిన అవకతవకలపై వెంటనే చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాజన్న ఆలయం దర్శనాలు నిలిపివేసిన సమయంలో ఎమ్మెల్యే ప్రజలకు, అన్ని పార్టీల నాయకులకు నిర్వహించిన సమావేశంలో శివరాత్రి నాటికి దర్శనం కల్పిస్తామని హామీ ఇచ్చారని, అనంతరం వచ్చే సంవత్సరం దర్శనాలు ప్రారంభమవుతాయని ప్రకటించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. వేములవాడ పట్టణ అభివృద్ధి పేరుతో రాజన్నను ప్రజలకు దూరం చేశారని, ఈ శ్రావణ మాసం నుంచే స్థానికులకు రాజన్న దర్శనం కల్పించకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు, నిరసనలు నిర్వహించడంతో పాటు వేములవాడ బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

భీమన్న ఆలయంలో కూడా స్థానిక భక్తుల దర్శనాలకు ఇబ్బందులు కలిగిస్తే సహించబోమని పేర్కొన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని అక్రమంగా విధులు నిర్వహిస్తున్న వారిని గుర్తించి, వారికి ఉద్యోగాలు కల్పించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకుడు, కౌన్సిలర్ కుమ్మరి శంకర్, కౌన్సిలర్లు చిన్న ముత్యం, వంగల శీను, నాయకులు కోల కృష్ణస్వామి, రేగుల మల్లిఖార్జున్, పిన్నింటి హన్మాండ్లు రేగుల శ్రీకాంత్, గుడిసె మనోజ్, చిక్కుడు మల్లేశం, అన్నం నరసయ్య, రఘుపతి, నేరెళ్ల సాయి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బా బాలికల పాఠశాలలో ఘనంగా హరితహారం



భీంగల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా, భీంగల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి - స్వామి, వైస్ చైర్‌పర్సన్ సంటి లత--జేజే నర్సయ్య, కమిషనర్ డి. గజానంద్ కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూపర్యావరణ పరిరక్షణకు కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ అనురాధ, ప్రజాప్రతినిధులు, మున్సిపల్, మెప్మా సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# రాజధాని రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

**ఏఆర్ఎస్ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరావు**

**భూ సమీకరణకు ముందు రైతుల డిమాండ్లు పరిష్కరించాలి**



గుంటూరు( ప్రశ్న న్యూస్) నిడుముక్కల గ్రామం రాజధాని ప్రాంత రైతులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆంధ్ర రాష్ట్ర సమితి (ఏఆర్ఎస్) పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరావు స్పష్టం చేశారు. నిడుముక్కల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజధాని ప్రాంత రైతులు గత 373 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే మరోసారి రెండో విడత భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) పేరుతో రైతుల నుంచి భూములు తీసుకోవడానికి ప్రయత్నించడం అన్యాయమని విమర్శించారు. మొదటి భూ సమీకరణకు సంబంధించిన హామీలు, న్యాయపరమైన అంశాలు అమలు చేసిన తర్వాతే తదుపరి భూ సమీకరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలోని సుమారు 50 గ్రామాల్లో 1.75 లక్షల ఎకరాల భూములను సేకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించిన కోటేశ్వరావు, రైతులు తమ భూములను ఇవ్వకుండా ఐక్యంగా నిలిచారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ప్లాట్లు విక్రయించిన తర్వాత రైతులకు స్థిరమైన ఉపాధి ఉండదని, అందువల్ల భూ సమీకరణకు బదులుగా భూ సేకరణ చట్టం ప్రకారం నాలుగు రెట్లు పరిహారం, రెండు ప్యాకేజీలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారని చెప్పారు. రైతుల నుంచి భూములను తీసుకుని వాటిని రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చి విక్రయించే ధోరణిని ప్రభుత్వం అవలంబిస్తోందని ఆరోపించారు. గత 12 సంవత్సరాలుగా పరిపాలన కంటే రియల్ ఎస్టేట్ అభివృద్ధిపైనే రాజకీయ నాయకులు ఎక్కువ దృష్టి పెట్టారని విమర్శించారు. ఇటీవల నిడుముక్కలు, తాడికొండ గ్రామాలకు అధికారులు భూ సమీకరణపై రావడం జరిగిందని, స్థానిక రైతుల అభిప్రాయాలు ముఖ్యమంత్రి దృష్టికి చేరడం లేదని ఆయన అన్నారు. రైతుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని కోరారు. పరిశ్రమలు, ఆసుపత్రులు, ఇతర ప్రాజెక్టుల కోసం రైతుల భూములను తక్కువ విలువకు తీసుకుంటున్నారని ఆరోపించిన కోటేశ్వరావు, రైతులకు ఎకరానికి రూ. 1 కోటి నగదు పరిహారం, 1,250 గజాల ప్లాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ సమీకరణను విడతలవారీగా కాకుండా అవసరమైన భూమిని ఒకేసారి సేకరించి, రైతులకు తగిన న్యాయం చేయాలని సూచించారు. రాజధాని అభివృద్ధి పేరుతో రైతుల ప్రయోజనాలను విస్మరించకుండా, వారి జీవనోపాధి, భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, న్యాయమైన పరిష్కారం చూపాలని జంజనం కోటేశ్వరావు విజ్ఞప్తి చేశారు.

# మాయాగన్ రాజకీయాలకు ప్రజలే తీర్పు చెబుతారు

**- ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్**

**- జంగాలపల్లిలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఘాటు విమర్శలు**



మైలవరం (ప్రశ్న న్యూస్)“మావిగన్ కాదు.. మాయాగన్! జగన్ పిచ్చి చేష్టలను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారు” అంటూ మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మైలవరం మండలం చంద్రగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగం ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేసిన ఎమ్మెల్యే, రాష్ట్ర విభజన అనంతరం ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నామని అన్నారు. 2014లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో పాలన ప్రారంభించి, అమరావతి రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాల భూమిని సమీకరించి వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిలిపివేసి, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు గట్టి తీర్పు ఇచ్చినా, ఇప్పటికీ అమరావతిపై విషప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. “అమరావతి ప్రతి ఆంధ్రుడి కల. దానిని అడ్డుకునే వారిని ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారు” అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారీ నిధులు సమకూరుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతుండగా, మరోవైపు పేదల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే అన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా అభివృద్ధికి కట్టుబడి పనిచేసే ప్రభుత్వానికే ప్రజలు మద్దతు ఇవ్వాలని, రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే శక్తులను ప్రజలు తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), రెవెన్యూ అధికారులు, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మేడ్చల్ డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )మేడ్చల్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించేందుకు మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంటరీ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు తీరును పరిశీలిస్తూ, బూత్ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఓటర్ల వివరాల నమోదు, సవరణలు, అభ్యంతరాల పరిష్కారంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని, ప్రతి అర్హులైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్ యాదవ్, ఎల్లంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి రమేష్, కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్, శ్రీలత రమేష్, రాజు నాయక్, ఆకేటి నవీన్ రెడ్డి మేడ్చల్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## పూడూరు-కిష్టాపూర్ డివిజన్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ

**మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి.**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూర్ కిష్టాపూర్ డివిజన్ పరిధిలో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ 298 పూడూరు--కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్లు 79, 80 ఎన్‌జీఓస్ కాలనీలో ఇంటింటా ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ ఉమా నాగరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చామకూర మహేందర్ రెడ్డి హాజరయ్యారు. వారు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరుకు సంబంధిత పత్రాలను అందజేసి, ప్రతి అర్హుడూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, వివరాలను సరిచూసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో బూత్ ఏజెంట్లు నాగరాజు ముదిరాజ్, బాల మల్లేష్ యాదవ్, బాల్రాజ్ ముదిరాజ్, చీదు వెంకట నరసింహారెడ్డి, మహేందర్, రాష్ట్ర నాయకులు మల్లికార్జున స్వామి, మాజీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, మాజీ కోఆప్షన్ సభ్యులు నవీన్ రెడ్డి, మహబూబ్ అలీ, లాయక్ అలీ, అలాగే సత్తయ్య, పూడూరు మాజీ సర్పంచులు బాబు యాదవ్, వెంకటేష్, కృష్ణ, ఈశ్వరయ్య, మోహన్ రెడ్డి, నర్సింగ్ గౌడ్, శేఖర్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓటరు నమోదు, వివరాల సవరణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## గుండ్ల పోచంపల్లి డివిజన్ లో సైబరాబాద్ కమిషనర్ సృజన పర్యటన



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) గుండ్ల పోచంపల్లి డివిజన్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేయాలని సైబరాబాద్ కమిషనర్ సృజనను పలువురు నేతలు కోరారు. మౌలిక సదుపాయాలు, రోడ్ల మరమ్మత్తులు, అంతర్గత మురికి కాలువలు, విద్యుత్తు లైట్లు సీసీ రోడ్లు,ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు వెంటనే అధికారులకు పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేయాలని సైబరాబాద్ కమిషనర్ సృజన ను గుండ్ల పోచంపల్లి డివిజన్ నేతలు కోరారు. గుండ్ల పోచంపల్లి డివిజన్లో ఏర్పాటుచేసినవన్ వర్డ్ ఎవరీ యాక్షన్ పేరుతో మేడ్చల్ సర్కిల్ డిసి సుధాంశు ఏర్పాటు చేసిన సభకు మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్ మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి గుండ్ల పోచంపల్లి డివిజన్ తొలిసారిగా విచ్చేసిన సైబరాబాద్ కమిషనర్ సృజన ఆహ్వానం పలికి సమస్యలు వివరించారు. డివిజన్లోని అన్ని గ్రామాలలో ప్రతి ఒకరోజు సభలు ఏర్పాటు చేయాలని కమిషనర్ కు సురేందర్ ముదిరాజ్ విన్నవించారువీరి వెంట సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంబంధించిన అధికారులు తదితరులు ఉన్నారు.

## సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

**డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా మేడ్చల్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అభివృద్ధి,సంక్షేమం అన్ని వర్గాల ప్రజలకు అందుతుందన్నారు.మేడ్చల్ నియోజకవర్గంలోని కొత్తగా నియామకమైన డివిజన్ అధ్యక్షులకు నియామకపు పత్రాలను అందజేశారు.మేడ్చల్ డివిజన్ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్,కిష్టాపూర్ పూడూర్ డివిజన్ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్ లు నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ కుమార్ యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ,నాయకులు ,కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణం పూర్తయిన భవనానికి అనుమతులు రద్దు

- హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం, ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు
- సోమాజిగూడలో 17 అంతస్తుల భవన నిర్మాణ అనుమతుల రద్దుకు ప్రతిపాదన
- ప్రాజెక్టు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను నిలిపివేసిన జీహెచ్ఎంసీ
- అధికారుల సంయుక్త తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన ఉల్లంఘనలు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో భారీ వివాదం వెలుగులోకి వచ్చింది. నగరంలోని అత్యంత ప్రతిష్టాత్మక ప్రాంతమైన సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డు పార్క్ హోటల్ సమీపంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రదీప్ కన్స్ట్రక్షన్స్' చేపట్టిన భారీ మల్టీ స్టోరీడ్ గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఊహించని షాక్ ఇచ్చింది. హుస్సేన్ సాగర్ గరిష్ట వరద మట్టం పరిధిని ఆక్రమించడంతో పాటు, తీవ్ర వివాదాస్పద భూమిలో ఈ ప్రాజెక్టును నిర్మించారంటూ జీహెచ్ఎంసీ అధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ బిల్డింగ్‌కు ఇచ్చిన నిర్మాణ అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ బిల్డింగ్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో ఈ అపార్ట్‌మెంట్‌లో కోట్లు పోసి ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారు షాక్‌కు గురవున్నారు. ప్రదీప్ రెడ్డి బద్వేలు అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి యాజమాన్యంలోని ఈ సంస్థ సోమాజిగూడలో 2 సెలర్స్ స్టిల్ట్ ఇంకా 17 పైఅంతస్తులతో పాటు ఒక భారీ క్లబ్ హౌస్‌తో కూడిన రెండు స్కైస్క్రాపర్ టవర్లను నిర్మించింది. అయితే, ఈ ప్రాజెక్ట్ నిర్మించిన ల్యాండ్ పూర్తిగా వివాదాస్పదమైనదని, పైగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని నిర్ధారణ కావడంతో అధికారులు రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ యాక్ట్, 1955 లోని సెక్షన్ 450 కింద ప్రదీప్ కన్స్ట్రక్షన్స్‌కు మున్సిపల్ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నిర్మాణ అనుమతులు పొందే సమయంలో బిల్డింగ్ నిర్వాహకులు అసలు నిజాలను దాచిపెట్టారని , తప్పుడు పత్రాలతో తప్పుదోవ పట్టించి పర్మిషన్లు పొందారని అధికారులు ఈ నోటీసులో ప్రాథమికంగా తేల్చారు.

ఈ వివాదాలు ఉన్నందున సదరు 17 అంతస్తుల బిల్డింగ్‌కు సంబంధించి బిల్డర్ దరఖాస్తు చేసుకున్న ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ను జీహెచ్ఎంసీ పూర్తిగా నిలిపివేసింది. ప్రస్తుతానికి ఈ భవనానికి ఎలాంటి ఓసీ జారీ చేయలేదని అధికారులు స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ తీసుకున్న ఈ ఆకస్మిక చర్యతో సదరు అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి, ఉన్నత వర్గాల ప్రజలంతా ఒక్కసారిగా రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. తమ జీవితకాల సంపాదనను, బ్యాంకు లోన్లను నమ్ముకుని కోట్లాది రూపాయలు వెచ్చించి ఈ 17 అంతస్తుల టవర్లలో ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారికి ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవడం లేదు. చట్టప్రకారం ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేని బిల్డింగ్‌లోకి ప్రవేశించడం, నివసించడం పూర్తిగా చట్టవిరుద్ధం. ఒకవేళ విచారణ అనంతరం జీహెచ్ఎంసీ గనుక బిల్డింగ్ పర్మిషన్‌ను పూర్తిగా రద్దు చేస్తే.. ఈ భవనానికి విద్యుత్, తాగునీటి కనెక్షన్లు కూడా దక్కవు.

హైడ్రా, జీహెచ్ఎంసీ జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించిన తర్వాతే ఈ అక్రమాలు వెలుగుచూశాయని టాక్ నడుస్తోంది. బిల్డర్ చేసిన తప్పుకు, తప్పుడు డాక్యుమెంట్లు నమ్మి మోసపోయిన తాము ఇప్పుడు బలిపశువులమయ్యామని కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. ఒకవైపు బిల్డింగ్ పర్మిషన్ రద్దు ముప్పు, మరోవైపు ఓసీ రాకపోవడంతో.. కొన్న ఫ్లాట్లలోకి ఎప్పుడు అడుగుపెడతామో, అసలు ఈ బిల్డింగ్ నిలుస్తుందో లేదో తెలియని అగమ్యగోచర స్థితిలోకి హోమ్ బైయర్స్ నెట్టబడ్డారు. ఈ వ్యవహారంపై ప్రదీప్ కన్స్ట్రక్షన్స్ ఇచ్చే వివరణపైనే ఈ ప్రాజెక్టు భవితవ్యం ఆధారపడి ఉంది.

## పుష్కరాల నాటికి అభివృద్ధి పనుల పూర్తి

**– ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ – కూటమి కార్యకర్తలే విజయానికి వెన్నెముక**



రాజమహేంద్రవరం(ప్రశ్న న్యూస్) రాజమహేంద్రవరం నగరంలోని 45, 46 డివిజన్లలో గతంలో నిర్లక్ష్యానికి గురైన మౌలిక సదుపాయాలను కూటమి ప్రభుత్వం వేగంగా అభివృద్ధి చేస్తోందని, గోదావరి పుష్కరాల నాటికి ప్రధాన అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు. ప్రజలతో పాటు కూటమి కార్యకర్తలు, నాయకులతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే “మన వార్డులో – మన ఆదిరెడ్డి” కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. రామదాసుపేట మున్సిపల్ పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముందుగా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సూచించారు.అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో 45వ డివిజన్‌లో వెయ్యికి పైగా, 46వ డివిజన్‌లో రెండువేలకుపైగా మెజారిటీ రావడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు.ఈ రెండు డివిజన్లలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే 9 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల మార్పు, త్రీ–ఫేజ్ విద్యుత్ విస్తరణ వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు.45వ డివిజన్‌లో ఇప్పటికే రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, గోదావరి పుష్కరాల దృష్ట్యా మరో రూ.8 కోట్ల పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 46వ డివిజన్‌లో రూ.80 లక్షల పనులు పూర్తయ్యాయని, అదనంగా రూ.10 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్ అండ్ బి వాంబే గృహాల వద్ద కమ్యూనిటీ హాల్‌ను సీఎస్ఆర్ నిధులతో రూ.38 లక్షల వ్యయంతో పునరుద్ధరిస్తున్నామని, ప్రహరీ గోడ, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. రైతు బజార్, సచివాలయం వంటి ప్రజా సౌకర్యాలను స్థానికులకు మరింత చేరువ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణను అభినందించిన: సీఎం చంద్రబాబు



అమరావతి(ప్రశ్న న్యూస్)కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికైన ఏపీ నాటక అకాడమీ చైర్మన్, ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో అభినందించారు. ఇటీవల ప్రతిష్మాత్మకమైన కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికైన సందర్భంగా గోపాలకృష్ణ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రంగస్థల నటన విభాగంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు లభించడం తెలుగు నాటక రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. గుమ్మడి గోపాలకృష్ణ తన ప్రతిభ, అంకితభావంతో తెలుగు రంగస్థల కళను జాతీయ స్థాయిలో నిలబెట్టారని కొనియాడారు. గోపాలకృష్ణ ప్రదర్శించే నాటకాలు ప్రేక్షకులను ఆలోచింపజేసేలా, కళాత్మక విలువలను ప్రతిబింబించేలా ఉంటాయని సీఎం ప్రశంసించారు. ఆయన నటన, కళాసేవ ద్వారా తెలుగు నాటక రంగానికి విశిష్ట గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు.కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకోవడం వ్యక్తిగత విజయమే కాకుండా, తెలుగు నాటక కళాకారులందరికీ గర్వకారణమని సీఎం పేర్కొంటూ గుమ్మడి గోపాలకృష్ణకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తెలుగు నాటక రంగానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

## ఎల్‌నినో ప్రభావం ఉన్నా రైతులకు ఇబ్బంది లేదు:మంత్రి అచ్చెన్నాయుడు

- వంశధార నీటితో సాగుకు ప్రభుత్వం అండ
- ఆందోళన చెందొద్దని మంత్రి భరోసా



శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా వర్షపాతం తగ్గినప్పటికీ శ్రీకాకుళం జిల్లా రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. వంశధార క్యాచ్‌మెంట్ ప్రాంతంలో నీటి నిల్వలు పూర్తిస్థాయిలో లేకపోయినా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటిని విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం రైతాంగానికి పూర్తి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు రైతులు ప్రభుత్వానికి, అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కాలువల శివారు ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలకు కూడా సాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నీటి పంపిణీలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రతి చుక్క నీటిని సాగుకు ఉపయోగించుకోవాలని రైతులకు మంత్రి సూచించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం అన్ని విధాలుగా కట్టుబడి ఉందని, పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## 14వ వార్డులో ముమ్మరంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

- సీజనల్ వ్యాధుల నివారణకు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )వర్షాకాలాన్ని పురస్కరించుకుని ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో చేపట్టిన ‘శానిటేషన్ స్పెషల్ డ్రైవ్’ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, స్థానిక కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం 14వ వార్డులోని ఉన్నిసంఘం ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి పరిశుభ్రత పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో పాత ప్లాస్టిక్ డ్రమ్‌లు, టైర్లు, టెర్రస్‌పై ఉన్న పాత్రల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.మురికినీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే తడి, పొడి చెత్తను రోడ్లపై లేదా ఖాళీ స్థలాల్లో వేయకుండా, మున్సిపల్ చెత్త సేకరణ వాహనంలో మాత్రమే వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, స్థానిక నాయకులు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# 'సూపర్ సుబ్బు' సిరీస్ రివ్యూ!




ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై థ్రిల్లర్ జోనర్ కి సంబంధించిన సిరీస్ లు రాజ్యం చేస్తున్నాయి. హారర్ థ్రిల్లర్ .. సస్పెన్స్ థ్రిల్లర్ .. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే కథలు ఒక రేంజ్ లో దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో సెక్స్ ఎడ్యుకేషన్ కి సంబంధించిన కథ ఒకటి 'నెట్ ఫ్లిక్స్' తెరపైకి వచ్చింది. ఆ సిరీస్ పేరే 'సూపర్ సుబ్బు'. సందీప్ కిషన్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సిరీస్, ఈ నెల 2వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. సుబ్రహ్మణ్యం (సందీప్ కిషన్) ను అంతా సుబ్బు అని పిలుస్తుంటారు. తండ్రి .. తల్లి .. ఓ మేనమామ ఇదే అతని కుటుంబం. తండ్రి కుక్కుటేశ్వరరావు (మురళీ శర్మ) స్కూల్ హెడ్ మాస్టర్ గా పనిచేసి రిటైర్ అవుతాడు. ఇక మేనమామ సునీల్ ( సంపూర్ణేశ్ బాబు) పెళ్లి చేసుకోకుండా అలా ఉండిపోతాడు. తాను పనిచేసిన స్కూల్లో ల్యాబ్ అసిస్టెంట్ గా సుబ్బుకి టెంపరరీ పోస్ట్ వేయిస్తాడు కుక్కుటేశ్వరరావు. టీనేజ్ లో ఉన్నప్పటి నుంచే సెక్స్ ఎడ్యుకేషన్ పట్ల సుబ్బు ఆసక్తిని చూపించేవాడు. అందువలన అతని పట్ల తండ్రి ఒక రకమైన కోపాన్ని పెంచుకుంటాడు. ఒకానొక సందర్భంలో సుబ్బు ల్యాబ్ అసిస్టెంట్ జాబ్ కూడా పోగోట్టుకునే పరిస్థితి వస్తుంది. దాంతో అతనికి సెక్స్ ఎడ్యుకేషన్ పట్ల ఆసక్తి ఉందనే విషయాన్ని ప్రిన్సిపాల్ మధుసూదనరావు (బ్రహ్మానందం) గమనిస్తాడు. 'మాకీపూర్' అనే విలేజ్ కి సెక్స్ ఎడ్యుకేషన్ నేర్పించడానికి వెళ్లిన తన బావమరిది తన్నులు తినేసి తిరిగి రావడంతో, మధుసూదనరావు ఆ స్థానంలో సుబ్బును పంపిస్తాడు. అయితే తాను ఏ పనిపై వెళుతున్నది తండ్రికి చెప్పకూడదని సుబ్బు మాట తీసుకుంటాడు. దివ్య (మానస చౌదరి)తో సుబ్బుకి పెళ్లి కుదురుతుంది. ఆమెకి నచ్చినట్టుగా ఉండటం కోసమే, అతను ఆ జాబ్ చేయడానికి అంగీకరిస్తాడు. 'మాకీపూర్' గ్రామస్తులు చాలా తేడా మనుషులనీ, వాళ్లకి లైంగిక విజ్ఞానంపై ఏ మాత్రం అవగాహనా లేదని తెలుసుకుంటాడు. వాళ్లలో మూఢనమ్మకాలు బలంగా ఉంటాయని వింటాడు. ఆ తరువాతనే అతను మాకీపూర్ వెళ్లి, తన డిపార్టుమెంటుకి చెందిన 'కాంతారావు' (గెటప్ శ్రీను)ను కలుసుకుంటాడు. 'మాకీపూర్'కి సంబంధించినంత వరకూ గిరి - గంగాధర్ - కిషన్ అనే వ్యక్తులు చాలా ప్రమాదకరమైనవారని తెలుసుకుంటాడు. ఇక సర్పంచ్ తమ్ముడు రమేశ్ కూడా అదే కోవకి చెందినవాడనే విషయం సుబ్బుకి అర్థమవుతుంది. అక్కడే అతనికి స్వాతి (మిథిలా పాల్కర్) పరిచయమవుతుంది. హీరోయిన్ కావాలనే పట్టుదలతో ఉన్న ఆమె, రీల్స్ చేస్తూ ఉంటుంది. ఆ ఊళ్లో సుబ్బుకి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? వాటిని అతను ఎలా అధిగమిస్తాడు? అనేది కథ. మారుమూల గ్రామాలలోని ప్రజలు సెక్స్ గురించి మాట్లాడటానికి ఇబ్బందిపడుతూ ఉంటారు. శానిటరీ ప్యాడ్ .. కండోమ్ గురించి మాట్లాడటాన్ని బూతుగా భావిస్తారు. ఆడపిల్లలు .. మగపిల్లలు ఎందుకు పుడతారనేది తెలియక, మగపిల్లల కోసం వరుస కాన్పులకు వెనుకాడకపోవడం కనిపిస్తుంది. ఫ్యామిలీ ప్లానింగ్ పట్ల అవగాహన లేని కారణంగా, పురుషులు తాము ఏదో కోల్పోయామనే ఆందోళనకి లోనవుతుంటారు. అలాంటి ఒక ఊరుకు సెక్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గా వెళ్లిన సుబ్బు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది? అనేది ఈ కథలోని ప్రధానమైన అంశం. టీనేజ్ నుంచి తన కొడుకు సెక్స్ పట్ల ఆసక్తిని కనబరుస్తూ ఉన్నాడని భావించిన సుబ్బు తండ్రి, కొడుకు పట్ల ఒక అసహ్యాన్ని పెంచుకుంటాడు. సుబ్బు మేనమామకు కూడా అతనిపై అలాంటి అభిప్రాయమే ఉంటుంది. ఈ కథలోకి తొలి అడుగులు వేస్తున్న ప్రేక్షకులు కూడా ముందుగా అదే ఆలోచనకి వస్తారు. కానీ అతను సెక్స్ కంటే కూడా ప్రేమకి ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తాడనే దిశగా ఆ పాత్రను నడిపించిన తీరు గొప్పగా అనిపిస్తుంది. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో సెక్స్ అనేది చాలా సున్నితమైన అంశంగా అనిపిస్తుంది. ముఖ్యంగా అక్కడి మహిళల దగ్గర అందుకు సంబంధించిన ప్రస్తావన చేయడమే ప్రమాదకరంగా మారుతుంది. ఎందుకంటే తరతరాలుగా బలపడిన మూఢనమ్మకాలలోనే వాళ్లు బ్రతుకుతుంటారు. అలాంటి ఒక ఊర్లో .. అక్కడి ప్రజలలో లైంగిక సంబంధమైన విజ్ఞానాన్ని పెంపొందించడానికి కథానాయకుడు ఎంత రిస్క్ చేశాడనేది చూపించడానికి దర్శకుడు ప్రయత్నించాడు. అయితే దర్శకుడు సుబ్బు పాత్రపై .. అతని తండ్రి పాత్రపై మాత్రమే పూర్తి దృష్టి పెట్టడం కనిపిస్తుంది. ఎందుకంటే ఈ రెండు పాత్రలు మినహా మిగతా పాత్రలు తేలిపోతుంటాయి. సుబ్బుతో పెళ్లికి ఒప్పుకున్న 'దివ్య' పాత్ర .. విలేజ్ లో రీల్స్ చేసే 'స్వాతి' పాత్ర .. సర్పంచ్ తమ్ముడు కూతురు 'అలేఖ్య' పాత్రలను సరిగ్గా డిజైన్ చేయలేదు. దాంతో ఆ పాత్రల వైపు నుంచి ఆశించిన అవుట్ పుట్ రాలేదు. కథలో లవ్ .. కామెడీ .. ఎమోషన్స్ ఉన్నాయి. కానీ వాటిని బలంగా ఆవిష్కరించలేకపోయారు. చాలా పాత్రలు తెరపైకి వస్తుంటాయి .. వెళుతుంటాయి. పేరున్న ఆర్టిస్టులే ఆ పాత్రలలో కనిపిస్తూ ఉంటారు. కానీ ఆడియన్స్ కామెడీ పరంగా గానీ .. ఎమోషన్స్ వైపు నుంచి గాని ఎక్కడా కనెక్ట్ కాలేకపోతారు. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ కూడా అందుకు మినహాయింపేమీ కాదు. గ్రామీణ వాతావరణం .. అక్కడి మనుషులు .. వారి స్వభావాలను సహజత్వానికి దగ్గరగా ఆవిష్కరించిన విధానం మాత్రం ఆకట్టుకుంటుంది. సందీప్ కిషన్ .. మురళీశర్మ నటన మెప్పిస్తుంది. వేశ్యగా దివ్య పిళ్లై పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆ పాత్రను ఇంకాస్త పెంచవలసిందని అనిపిస్తుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఫరవాలేదు. లైన్ బాగుంది .. కానీ కంటెంట్ ను కావాల్సినంత వినోదభరితంగా చెప్పలేకపోయారేమోననే భావన కలుగుతుంది.

## ఉవ్వెత్తున ఎగిసే ఉత్తుంగ తరంగం



అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. సోమవారం ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'అణువు అణువును ఉగ్రూతలూపే ప్రణయ కల్లోలమే-రోమాంచకం, ఊహకే అందని ఉవ్వెత్తునెగిసే ఉత్తుంగ తరంగమే రో మాంచకం' అంటూ మెలోడియస్ ట్యూన్‌తో ఈ గ్లింప్స్ ఆకట్టుకునేలా ఉంది. వాసుకి వైభవ్ మ్యూజిక్, విజువల్స్ ఈ గ్లింప్స్‌లో ప్రధానాకర్షణగా నిలిచాయి.

ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలబోసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వాసుకి వైభవ్, రచన-దర్శకత్వం: వేణుగోపాల్ రెడ్డి.

## దేశ చరిత్ర ఆధారంగా తీసిన సినిమా



'కొత్తవాళ్లమంతా కలిసి భారీ ఖర్చుతో ఈ కొత్త ప్రయత్నం చేశాం. అనంతపద్మనాభస్వామి తెరపై కనిపిస్తుంటే ప్రేక్షకులు చెప్పులు విడిచి చూస్తున్నారు. వారి కళ్లలో ఆనందభాష్పాలు కనిపిస్తున్నాయి. ఇంతకు మించిన భావోద్వేగం ఏముంటుంది? 'హరహర మహాదేవ' నినాదంతో థియేటర్లు మారుమోగుతుంటే ఇంతమించిన అనుభూతి ఏముంటుంది? దర్శకుడు అభిషేక్ గొప్ప విజన్‌తో ఈ సినిమా తీశారు. ముఖ్యంగా ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్,క్లైమాక్స్ ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకున్నాయి' అని హీరో విరాట్‌కర్ణ అన్నారు. ఆయన హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. నభానటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలు. కిశోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన థాంక్స్‌మీట్‌లో హీరో విరాట్‌కర్ణ మాట్లాడారు. 'సినిమాకు అద్భుతమైన స్పందన వస్తున్నది. ఫస్టాఫ్‌లో కాస్త లెన్త్ ఎక్కువైంది. దాంతో ప్రేక్షకుల సలహా మేరకు కాస్త తగ్గించాం,క్లైమాక్స్ కూడా ట్రిమ్ చేశాం. ఇది ఫిక్షనల్ స్టోరీ కాదు. ఆఫ్ఘన్‌లు మన దేశంపై దాడికి తెగబడ్డప్పుడు. ఆదిశంకరాచార్యులవారు నాగసాధువులనే వర్గాన్ని ఏర్పాటుచేసి, మన దేవాలయాలను రక్షించారు. మన చరిత్ర ఆధారంగానే తీసిన సినిమా ఇది. నేటి తరానికీ, రానున్న తరానికి కూడా మన చరిత్ర తెలియానే ఉద్దేశంతో చేసిన ప్రయత్నం ఇది' అని దర్శకుడు అభిషేక్ నామా పేర్కొన్నారు.



## ప్రపోజ్ చేసిన అబ్బాయికి రాఖీ కట్టా..

### కానీ అతడు నాకే తిరిగిచ్చాడు: అంజలి

ప్రేమిస్తున్నానంటూ వెంటపడిన ఓ అబ్బాయికి రాఖీ కట్టి అన్నయ్యను చేసుకోబోతే.. అతడు వెంటనే దాన్ని తీసి తనకే తిరిగిచ్చాడంటూ తన స్కూల్ నాటి ఓ సరదా సంఘటనను గుర్తుచేసుకున్నారు నటి అంజలి. కెరీర్ ఆరంభం నుంచి తన వ్యక్తిగత జీవితంపై, ముఖ్యంగా ప్రేమ వ్యవహారాలపై వస్తున్న పుకార్లతో విసిగిపోయానని ఆమె అన్నారు. ప్రస్తుతం తన తమిళ చిత్రం 'మగుడం' (తెలుగులో మకుటం) ప్రమోషన్లలో బిజీగా ఉన్న అంజలి, ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.కొంతకాలంగా పలువురు నటులతో తనకు సంబంధం ఉందంటూ వస్తున్న వార్తలపై అంజలి స్పందించారు. "ఈ పుకార్లు నన్ను చాలా బాధించాయి. నేను ఒకరి పేరు చెబితే, మీరు మరొకరి గురించి అడుగుతారు. అందుకే ఎవరి పేరు చెప్పదల్చుకోలేదు. ప్రస్తుతం నా జీవితంలో ఎవరూ లేరు" అని ఆమె స్పష్టం చేశారు. ప్రేమ, పెళ్లి వంటి విషయాలపై వస్తున్న వదంతులకు ఫుల్‌స్టాప్ పెట్టారు. గతంలో జరిగిన ఓ సంఘటనను పంచుకుంటూ, "స్కూల్లో ఓ అబ్బాయి పదేపదే ప్రపోజ్ చేస్తుంటే, అతనికి రాఖీ కట్టాను. కానీ వాడు వెంటనే దాన్ని తీసి నా చేతికే తిరిగి ఇచ్చేశాడు" అని నవ్వుతూ చెప్పారు. ప్రస్తుతం తాను సినిమాలపైనే పూర్తి దృష్టి సారించానని, 'మగుడం' సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని అంజలి తెలిపారు.

## యూత్‌ఫుల్ వైబ్‌తో ప్రదీప్‌రంగనాథన్ సినిమా



యువతరం కథానాయకుడు, దర్శకుడు, రచయిత ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా కొత్త ప్రయాణం మొదలుపెట్టారు. 'పీఆర్ షో' అనే నిర్మాణ సంస్థను స్థాపించి తొలి ప్రయత్నంగా 'డ్రాగన్' దర్శకుడు అశ్వత్ మారిముత్తు, మమితా బైజు ప్రధాన పాత్రధారులుగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ది ఆల్ఫా యూనిట్(విశాల్ టీఆర్, యశ్.వి, నరేన్ సావోడా, చాణక్యన్.ఆర్, ధనుష్‌కుమార్, ఇలంపరిధి) ఈ చిత్రాన్ని దర్శకత్వం వహించనున్నది. ఈ సినిమాను సోమవారం అధికారికంగా ప్రకటించారు. దీనికి కథకుడు కూడా ప్రదీప్ రంగనాథనే కావడం విశేషం. ఒకే సినిమాకు ఆరుగురు దర్శకత్వం వహించడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో అంతా యూత్‌ఫుల్ వైబ్‌తో సాగింది. శివాజీ సొంటినేని, స్వసిక, అనామిక మహి, లిజ్జీ ఆంటోని ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: సాయి అభ్యంకర్, నిర్మాణం: పీఆర్ షో.

## హైదరాబాద్ 'అమీర్ లోగ్'




ఎంసీ హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అమీర్ లోగ్'. రమణా రెడ్డి సోమ దర్శకత్వంలో మాధవి రెడ్డి సోమ నిర్మించిన ఈ చిత్రాన్ని రానా స్పిరిట్ మీడియా రిలీజ్ చేయబోతున్నది. సోమవారం టీజర్‌ను నిర్మాత వంశీ నందిపాటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ సినిమాలో రియల్ హైదరాబాద్ కల్చర్‌ను చూపించారని, మధ్య తరగతి జీవితాలను చక్కగా ఆవిష్కరించారని అన్నారు. హైదరాబాద్ నేపథ్యంలో ఆద్యంతం వినోదం, భావోద్వేగాల కలబోతగా సాగే చిత్రమిదని నిర్మాత మాధవి రెడ్డి తెలిపారు. వేద జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్ సాయి, దర్శకుడు: రమణా రెడ్డి సోమ.

## వెంకీ అట్లూరి దర్శకత్వంలో?



అగ్ర కథానాయకుడు నాని ప్రస్తుతం 'ది ప్యారడైజ్' షూట్‌లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా షూటింగ్ ఆలస్యం కావడంతో నానితో సినిమా చేయాలనుకున్న దర్శకులంతా వేరే హీరోల బాట పడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'బ్లడీ రోమియో' కథను నానితో తీసేందుకు సిద్ధంగా ఉన్న సుజీత్ సైతం 'ది ప్యారడైజ్' లేట్ కారణంగానే 'ఓజీ 2'ను లైన్‌లో పెట్టే పనిలో పడ్డారని ఇన్‌సైడ్ టాక్. ఇదిలావుంటే.. నాని తాజాగా దర్శకుడు వెంకీ అట్లూరి కథకు ఓకే చెప్పారు. వీరిద్దరి మధ్య చాలాకాలంగా కథా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఎట్టకేలకు వెంకీ రీసెంట్‌గా చెప్పిన కథ నానిని బాగా ఆకట్టుకున్నదట. దాంతో ఆయన పచ్చజెండా ఊపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమా నిర్మిస్తారట. అందరూ అనుకుంటున్నట్టు దర్శకుడు సుజీత్ 'బ్లడీ రోమియో' కథను పక్కన పెట్టి 'ఓజీ 2'ను లైన్లోకి తెస్తే, 'ది ప్యారడైజ్' తర్వాత నాని చేసే సినిమా వెంకీ అట్లూరిదే అవుతుంది. ఒకవేళ సుజీత్ 'బ్లడీ రోమియో' సినిమానే ముందుకు తెస్తే, ఆ సినిమా పూర్తయ్యాక వెంకీ అట్లూరి సినిమా ఉంటుంది. ఏదేమైనా నాని లైనప్‌లో సరైన సినిమా వచ్చి చేరింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది.

## జైలర్ 2 బిజినెస్‌కు భారీ క్రేజ్.. రిలీజ్‌కు ముందే మలయాళంలో రికార్డు డిమాండ్



సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'జైలర్' సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ భారీ విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా మలయాళ మార్కెట్‌లో ఈ చిత్రం అనూహ్యమైన వసూళ్లు సాధించి రజినీకాంత్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు ఈ బ్లాక్‌బస్టర్‌కు సీక్వెల్‌గా రూపొందుతున్న జైలర్ 2 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన రిలీజ్ డేట్ గ్లింప్స్ సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. సోషల్ మీడియాలో ఆ వీడియోకు విశేష స్పందన లభించడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి.తాజా సమాచారం ప్రకారం, జైలర్ 2 విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సినిమా థియేట్రికల్ హక్కుల కోసం ఇప్పటికే మలయాళ మార్కెట్‌లో పోటీ మొదలైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేరళలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఈ సినిమా హక్కులను దక్కించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొదటి భాగం కేరళలో అద్భుతమైన వసూళ్లు సాధించడంతో పాటు, మలయాళ స్టార్ మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో కనిపించడం అక్కడి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో రెండో భాగంపై కూడా ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి.'జైలర్' తొలి భాగంలో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. అదే తరహాలో 'జైలర్ 2'లో కూడా ఆయన పాత్రకు ప్రాధాన్యత ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయినప్పటికీ, రజినీకాంత్‌తో పాటు మోహన్‌లాల్ క్రేజ్ కూడా మలయాళ మార్కెట్‌లో సినిమాకు అదనపు బలం చేకూరుస్తుందనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# శంకరయ్య జ్ఞాపకార్థం ఫ్రీజర్‌ను విరాళంగా అందజేసిన సిద్ధాంతి దీక్షిత్

**- సిద్ధాంతి దీక్షిత్ సేవా చొరవకు సర్పంచ్,ప్రజాప్రతినిధుల ప్రశంసలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామ పంచాయతీకి కొదురుపాక గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు సిద్ధాంతి దీక్షిత్ తన తండ్రి కీర్తిశేషులు శంకరయ్య జ్ఞాపకార్థం శవపేటిక ఫ్రీజర్‌ను విరాళంగా అందజేశారు. గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఫ్రీజర్‌ను విలాసాగర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా అవసరమైన సమయంలో ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. గ్రామానికి ఉపయోగకరమైన సేవ అందించిన సిద్ధాంతి దీక్షిత్‌ను అభినందించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దమ్మ వెంకటరమణ, జోగు శంకర్, ఏఎంసీ డైరెక్టర్ కల్లెపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్-వేములవాడలో చోరీలు చేసిన ఇద్దరు దొంగల అరెస్ట్

**- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్**

**- కేసును ఛేదించిన సిబ్బందికి సీఐ అభినందనలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణ పోలీసులు అంతర్ జిల్లా స్థాయిలో సెల్‌ఫోన్‌లు,ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, అనుమానాస్పదంగా తిరుగుతున్న కరీంనగర్‌కు చెందిన దుర్గం సాయి కృష్ణ (23), ఎస్‌కే సల్మాన్ (25)లను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఏపి15 ఏఎస్ 2592 నంబర్ గల హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్‌తో పాటు 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన వస్తువులను విక్రయించి వచ్చిన డబ్బును మద్యం, ఇతర విలాసాలకు ఖర్చు చేసినట్లు వెల్లడైంది. గతంలో వీరిపై కరీంనగర్, కొత్తపల్లి పోలీస్ స్టేషన్లలో దొంగతనం, గంజాయి కేసులు నమోదై జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్‌ఐ రామ్మోహన్, పీసీలు గోపాల్, ఖాజా ఇమ్రానుద్దీన్, సల్మాన్‌లను ఇన్‌స్పెక్టర్ వీర ప్రసాద్ అభినందించారు. అలాగే ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- రూ.113 కోట్ల రుణ లక్ష్య సాధనకు కార్యాచరణ రూపొందించాలి**

**- 'మన స్త్రీనిధి' యాప్ వినియోగాన్ని విస్తృతం చేయాలి**

**- జిల్లా కలెక్టర్ : గరిమ అగ్రవాల్**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీ, 'మన స్త్రీనిధి' యాప్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను మంగళవారం ఆదేశించారు.గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, మండల ఏపీఎంలతో నిర్వహించిన సమీక్షలో జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.113 కోట్ల రుణ లక్ష్యం కేటాయించబడిందని, వెనుకబడిన మండలాల్లో అర్హులైన మహిళా సంఘాలకు వేగంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జీరో రికవరీ ఉన్న సంఘాలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టి బకాయిల వసూళ్లు పెంచాలని, రుణాల దుర్వినియోగం, మోసాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాల ఉత్పత్తి, గొర్రెల పెంపకం, పౌల్ట్రీ, క్యాంటీన్లు, రూఫ్‌టాప్ సోలార్, ఈ-బైక్‌లు, ఈ-ఆటోలు వంటి జీవనోపాధి కార్యక్రమాలకు రుణాలు ప్రోత్సహించాలని, ప్రతి మహిళా సంఘ సభ్యురాలు 'మన స్త్రీనిధి' యాప్‌ను వినియోగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ ) ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను బిజెపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మేడ్చల్ లోని వివేకానంద విగ్రహం వద్ద భారీ కేక్ కట్ చేసే ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంద కృష్ణ మాదిగ ఇలాంటి జన్మదిన వేడుకలను మరిన్ని జరుపుకోవాలని రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు. మంద కృష్ణ తన సమాజానికివర్గానికి చేసిన సేవలు మరువలేనివి. ఆయన జీవితకాలం తన కుటుంబానికన్నా మాదిగ సామాజిక వర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సంఘం నాయకులు పురుషోత్తం, శివ కుమార్, బాలనర్సింహ, రామకృష్ణ, రాజు, పానుగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

# స్థలం కేటాయింపులో జాప్యం.. ఏడాదిగా అటకెక్కిన పోస్టాఫీస్ భవన నిర్మాణం

**- మున్సిపల్-రెవెన్యూ శాఖల సమన్వయ లోపం.. నిలిచిన నిర్మాణ పనులు**

**- నిధులున్నా.. నిలిచిన భీంగల్ పోస్టాఫీస్ భవన నిర్మాణం**

**- ఉన్నతాధికారుల జోక్యం కోరుతున్న భీమ్‌గల్ ప్రజలు**

**- బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ : నీలం రవి**



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,భీంగల్ పట్టణ ప్రజల ఎన్నో ఏళ్ల కల అయిన పోస్టాఫీస్ భవన నిర్మాణం అధికారుల నిర్లక్ష్యం కారణంగా అటకెక్కింది. కేంద్ర ప్రభుత్వం పోస్టాఫీస్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ, భవన నిర్మాణానికి అవసరమైన స్థలం ఇప్పటికీ పోస్టల్ శాఖకు అప్పగించకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఏడాదికిపైగా కాలం గడిచినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పోస్టాఫీస్ భవన నిర్మాణానికి అవసరమైన 0.02 గుంటల స్థలం కేటాయింపు విషయంలో మున్సిపల్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై ప్రశ్నిస్తే మున్సిపల్ అధికారులు "ఇది తమ పరిధిలోకి రాదని", రెవెన్యూ అధికారులు "మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాల్సి ఉందని" ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టివేస్తున్నారని విమర్శిస్తున్నారు. దీంతో సాధారణ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు భీంగల్ మున్సిపల్ కౌన్సిల్ కూడా చర్యలు తీసుకుంది. సీఆర్ నంబర్ 65/2025 ద్వారా పోస్టాఫీస్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు తీర్మానం చేసి, తహసీల్దార్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించినప్పటికీ, ఇప్పటివరకు ఆ తీర్మానం అమలు కాలేదని తెలుస్తోంది.స్థల సమస్యపై స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని, బాధ్యత గల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.పోస్టాఫీస్ భవనం నిర్మాణం పూర్తయితే భీంగల్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు పోస్టల్, బ్యాంకింగ్, స్పీడ్‌పోస్ట్, పార్శిల్, పొదుపు పథకాలు వంటి సేవలు మరింత మెరుగ్గా అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం సరైన భవనం లేకపోవడంతో పోస్టల్ సేవల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.ప్రభుత్వం కేటాయించిన నిధులు వినియోగం కాకుండా నిలిచిపోవడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ కాలయాపన చేయకుండా వెంటనే స్థలాన్ని పోస్టల్ శాఖకు అప్పగించి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ సందర్భంగా భీంగల్ మున్సిపల్ కౌన్సిలర్ నీలం రవి మాట్లాడుతూ, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకొని స్థల సమస్యను పరిష్కరించాలని కోరారు. పోస్టాఫీస్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సమాజ అభ్యున్నతికి ఐక్యంగా పనిచేద్దాం

**- మున్నూరు కాపు సంఘం బలోపేతమే లక్ష్యం**

**- మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి : వారాల దేవయ్య**

**- వేములవాడలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్యవర్గ తొలి వార్షికోత్సవం**



వేములవాడ (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కార్యవర్గం తొలి వార్షికోత్సవ సమావేశం రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట పురుషోత్తం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య ఆధ్వర్యంలో, రాష్ట్ర కార్యదర్శి వారాల దేవయ్య, ఉపాధ్యక్షుడు గడ్డం నరసయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎర్రం ఆగయ్య, ప్రధాన కార్యదర్శులు కూర సురేష్, మీసం రాజయ్య, పటేల్ సంఘం అధ్యక్షుడు సారా శ్రీనివాస్, కాపు సంఘం నాయకుడు గోలి తిరుపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.సమావేశంలో సంఘం బలోపేతం, సామాజిక అభివృద్ధి, విద్య, ఉపాధి అవకాశాలు, యువతకు ప్రోత్సాహం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై విస్తృతంగా చర్చించారు. సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ భవిష్యత్ కార్యాచరణపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వారాల దేవయ్య మాట్లాడుతూ, మున్నూరు కాపు సమాజం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత విద్య, ఉద్యోగాల్లో ముందుండేలా సంఘం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా సంఘం కృషి చేస్తుందని, సమాజ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు.అనంతరం గత ఏడాది కాలంలో సంఘం చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించి, సమాజ అభ్యున్నతికి మరింత కృషి చేయాలని తీర్మానించారు. వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, పాల్గొన్న సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేసి, ముమెంటోలు, శాలువాలతో సన్మానించారు.

# సికిల్ సెల్ అనీమియా అవగాహన దినోత్సవం సందర్భంగా గజ్వేల్‌లో ఆరోగ్య శిబిరం

**గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌లో హెచ్‌బీ స్క్రీనింగ్ పరీక్షలు**

**- పరిశుభ్రత, పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ప్రపంచ సికిల్ సెల్ అనీమియా అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్ గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌లో మంగళవారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హీమోగ్లోబిన్ (హెచ్‌బీ) స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శ్రీనివాస్, పీఓ ఎంహెచ్ఎన్ డా. మీనా, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. బల్వీర్ సింగ్ సందర్శించి ఆరోగ్య సేవల నిర్వహణను పరిశీలించారు.అనంతరం హాస్టల్‌లోని పారిశుధ్య పరిస్థితులు, వంటగది నిర్వహణ, ఆహార నాణ్యతను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన, నివారణ చర్యలు, పోషకాహారం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డీఎంహెచ్ఎల్‌పీ డా. హిరణ్మయి, ఏఏఎమ్ సరస్వతి, ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు డా. శ్రీజ, ఆశా కార్యకర్త అమృత, శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు.

# గురుకులాల జోలికి వస్తే ఊరుకోం

**గజ్వేల్ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు పంగ మోహన్ బాబు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అమలు చేసిన గురుకుల విద్యా వ్యవస్థను బలహీనపరిచేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని గజ్వేల్ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు పంగ మోహన్ బాబు ఆరోపించారు.కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన గురుకుల విద్యాసంస్థలను రద్దు చేసే కుట్రలను విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర అట్టడుగు వర్గాల పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 1,023 గురుకులాలను ఏర్పాటు చేసి, 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయి వరకు విస్తరించారని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం సుమారు 6.5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ విద్యాసంస్థల ద్వారా ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకుంటున్న నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆయన విమర్శించారు. గురుకులాల వ్యవస్థకు ఎలాంటి నష్టం కలిగించినా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థి సంఘాలన్నీ ఏకమై ఉద్యమాలకు సిద్ధమవుతాయని హెచ్చరించారు.

విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని, గురుకుల విద్యా వ్యవస్థకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు ఉద్ధృతమవుతాయని, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పంగ మోహన్ బాబు హెచ్చరించారు.

# మెడిసిటీ హాస్పిటల్ కు ఎన్ ఎ బి హెచ్ అక్రిడేషన్

**వెల్లడించిన మెడిసిటీ హాస్పిటల్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )తెలంగాణాలో ఎన్ ఎ బి హెచ్ గుర్తింపు సాధించిన అతి కొద్ది టీచింగ్ హాస్పిటల్స్ లో మేడ్చల్ జిల్లా ఘనాపూర్ లోని మెడిసిటీ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఈ ఘనత సాధించింది.మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నాణ్యమైన వైద్య సేవలను అందించే దిశగా మరో మైలు రాయి సాధించింది. భారత దేశంలో వైద్య సేవలలో నాణ్యతను పరీక్షించి సర్టిఫికేట్ అందించే ఎన్ ఎ బి హెచ్ గుర్తింపును మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సాధించింది. తెలంగాణాలో ఉన్న మెడికల్ కాలేజీ అనుబంధ హాస్పిటల్స్ లో ఇలా ఎన్ ఎ బి హెచ్ గుర్తింపు సాధించిన అతి కొద్ది సంస్థలలో మెడిసిటి ఒకటిగా నిలుస్తుంది. ఇలా ఎన్ ఏ బి హెచ్ అక్రిడేషన్ గుర్తింపు పై వివరాలను ఉదయం మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ లో జరిగిన విలేఖరుల ప్రత్యేక సమావేశంలో సంస్థ యాజమాన్యం వెల్లడించింది. ముందుగా మెడిసిటీ సీఈవో ఐనిష్ మర్చంట్ మాట్లాడుతూ వైద్య సేవలలో నాణ్యత అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని అన్నారు. ఈ దిశగా నేడు మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ కు చెందిన అనుబంధ మెడిసిటి హాస్పిటల్ కు ఎన్ పి హెచ్ అక్రిడేషన్ కోసం పట్టుదలతో పని చేసి గుర్తింపు సాధించామని ప్రకటించారు.

దీనికి కొనసాగింపుగా ఇపుడు ఎన్ ఏ బి హెచ్ అక్రిడేషన్ సాధించి మరో మారు తాను చేస్తున్న సేవలు నాణ్యతతో కూడి ఉన్నాయని స్పష్టమవుతుందని అన్నారు. ఇలా నాణ్యమైన సేవలకు ఇచ్చే గుర్తింపుకు ముందు అన్ని రకములైన సేవలు రూపొందించిన నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఉన్నాయన్న విషయాన్ని ఎన్ ఏ బి హెచ్ ప్రత్యేకంగా తనిఖీలు చేసి వాటిని పరీక్షించిందని అన్నారు. ఇలా పరీక్షల అనంతరం సాధించిన గుర్తింపు శాశ్వతం కాదని ప్రతి రెండు, మూడేళ్లకు మరలా తనిఖీలు చేయడం జరుగుతుందని వివరిస్తూ అంటే నాణ్యమైన సేవలను నిరంతరాయం కొనసాగించాల్సి ఉంటుందని చెప్పారు.

ఈ గుర్తింపు ప్రక్రియ సాధించడం ద్వారా హాస్పిటల్ మొత్తం సిబ్బందిలో నాణ్యత పెరుగుతుందని తద్వారా అందించే సేవలు లోపం లేకుండా అందించగలుగుతామని వివరించారు. ఇప్పటికే హాస్పిటల్ లో ఎన్నో సదుపాయాలు అందుబాటులోనికి తెచ్చామని భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకొంటున్నామని ప్రకటించారు. విలేఖరుల సమావేశంలో మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ డా. దేవేందర్ సింగ్ నేగి పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ కంటే జాగృతి మంచిదా..?




## - కవితకు కలసిరాని టీఆర్ఎస్ సెంటిమెంట్!
## - లీగల్ గోల కంటే జాగృతి వైపు వెళ్లడమే శ్రేయస్కరమా?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత రాష్ట్ర సమితి నుండి బయటకు వచ్చి, తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ఒక సొంత ఐడెంటిటీని సృష్టించుకోవాలని భావించిన కల్వకుంట్ల కవితకు ప్రారంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పాత ఉద్యమ కాలం నాటి సెంటిమెంట్‌ను, గులాబీ కేడర్‌ను ఆకట్టుకోవడానికి వీలుగా ఆమె తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అనే పేరుతో సరికొత్త పార్టీని ప్రకటించారు. టీఆర్ఎస్ అనే మూడు అక్షరాలతో తెలంగాణ ప్రజలకు ఉన్న ఎమోషనల్ అటాచ్‌మెంట్‌ను రాజకీయంగా క్యాష్ చేసుకోవాలనేది ఆమె ప్లాన్. అయితే, కేంద్ర ఎన్నికల సంఘం వద్ద ఈ పేరు రిజిస్ట్రేషన్‌కు రాగానే కథ అడ్డం తిరిగింది. ఈ పేరుపై బీఆర్ఎస్ శ్రేణుల నుండి, ఇతర వర్గాల నుండి రికార్డు స్థాయిలో భారీగా అభ్యంతరాలు రావడంతో ఈసీ దీనిని తిరస్కరించింది. రాబోయే 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని కవితకు అల్టిమేటం జారీ చేసింది.

### - న్యాయపోరాటానికే కవిత మొగ్గు

కవిత మాత్రం వెనక్కి తగ్గకుండా ఈసీ నిర్ణయంపై న్యాయపోరాటం చేస్తానని ప్రకటిస్తున్నారు. అయితే, కవిత ఇలా పార్టీ పేరు చుట్టూ వివాదాలు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరిగితే అది క్షేత్రస్థాయిలో తీవ్ర గందరగోళానికి దారితీస్తుంది. ఒక కొత్త పార్టీ ప్రస్థానాన్ని ప్రారంభించేటప్పుడు కేడర్‌లో, ఓటర్లలో స్పష్టత ఉండాలి. కానీ, ఇప్పటికే ఒకటికి రెండుసార్లు పార్టీ పేరు మార్పులు, లీగల్ నోటీసుల వ్యవహారాలతో ప్రజల్లోకి నెగెటివ్ సిగ్నల్స్ వెళ్తున్నాయి. చివరకు నెలల తరబడి కోర్టుల్లో పోరాడినా ఈసీ పరిధిలోని సాంకేతిక అంశాల్లో కోర్టులు జోక్యం చేసుకునే అవకాశాలు చాలా తక్కువ కాబట్టి చివరి నిమిషంలో పేరు మార్చుకోవాల్సి వస్తే పార్టీలో తీవ్ర కన్ఫ్యూజన్ ఏర్పడటం ఖాయం.

### - జాగృతి పేరుపైనే అంచనాలు

నిజానికి కవిత బీఆర్ఎస్ నుండి బయటకు వచ్చి సొంతంగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించాలనుకున్నప్పుడు ఆమె దశాబ్ద కాలంగా నడుపుతున్న తెలంగాణ జాగృతి పేరునే పొలిటికల్ పార్టీగా మారుస్తారని రాజకీయ వర్గాలన్నీ బలంగా నమ్మాయి. కానీ ఆమె అనూహ్యంగా టీఆర్ఎస్ పేరును ఎంచుకుని చిక్కుల్లో పడ్డారు. తెలంగాణ సమాజంలో కవిత పేరు వినబడగానే అందరికీ మొదట గుర్తొచ్చేది తెలంగాణ జాగృతి మాత్రమే. మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో సాంస్కృతిక పునరుజ్జీవనం ద్వారా, బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తం చేయడం ద్వారా కవిత మహిళల్లో, గ్రామీణ ప్రాంతాల్లో జాగృతి బ్రాండ్‌ను విపరీతంగా ప్రమోట్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ సంస్థకు ప్రతి గ్రామంలోనూ, మండలంలోనూ బలమైన నెట్‌వర్క్, నిబద్ధత కలిగిన కేడర్ ఉన్నారు. తెలంగాణ రక్షణ సేన అనే ఒక కొత్త పేరును ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, దానికి గుర్తింపు తేవడానికి పడే శ్రమ కంటే ఇప్పటికే బ్రాండ్ ఇమేజ్ ఉన్న తెలంగాణ జాగృతి లేదా తెలంగాణ ప్రజా జాగృతి అని పార్టీగా మారిస్తే ప్రజల్లోకి దూసుకెళ్లడం అత్యంత సులువవుతుంది.

### - పేరు గందరగోళం త్వరగా తేల్చుసుకోవాలి!

అందుకే ప్రస్తుతం కవిత చుట్టూ ఉన్న ముఖ్య అనుచరులు, రాజకీయ శ్రేయోభిలాషులు ఆమెకు ఒక కీలకమైన సలహా ఇస్తున్నారు. లేనిపోని ప్రతిష్టకు పోయి టీఆర్ఎస్ అనే మూడు అక్షరాల కోసం ఈసీతో, కోర్టులతో కాలయాపన చేయడం కంటే ఈ గందరగోళానికి తక్షణమే తెరదించి జాగృతి నే అధికారిక రాజకీయ పార్టీ పేరుగా ప్రకటించుకోవాలని కోరుతున్నారు. చట్టపరమైన చిక్కుల్లో సమయాన్ని వృథా చేసుకోవడం కంటే, క్లీన్ రోడ్‌గా ఉన్న తెలంగాణ జాగృతి ' అస్త్రాన్ని ప్రయోగించడమే కవిత పొలిటికల్ కెరీర్‌కు సేఫ్ అండ్ బెస్ట్ రూట్ అని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. మరి కవిత ఏ నిర్ణయం తీసుకుంటారో

# చాట్‌జీపీటీలో అంతరాయం

### - ఆగిపోయిన ఇమేజ్ జనరేషన్ సేవలు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వేదిక చాట్‌జీపీటీలో ఇమేజ్ జనరేషన్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా అంతరాయం ఏర్పడింది. మంగళవారం వినియోగదారులు ప్రాంప్ట్‌లు నమోదు చేసినప్పటికీ, ఇమేజ్‌లు జనరేట్ కాకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సమస్యను గుర్తించామని, దీనిని పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపడుతున్నామని మాతృసంస్థ ఓపెన్‌ఏఐ వెల్లడించింది. ఉదయం నుంచి చాట్‌జీపీటీ ఇమేజ్ జనరేషన్ విభాగంలో అధిక సంఖ్యలో సాంకేతిక లోపాలు తలెత్తినట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఇంజినీర్లు సమస్యను చక్కదిద్దే ప్రక్రియను ప్రారంభించారు. ఈ అంతరాయం డాల్-ఈ ఆధారిత ఇమేజ్ క్రియేషన్ టూల్స్‌పై ప్రభావం చూపిందని, పరిష్కారానికి అవసరమైన చర్యలను తీసుకుంటున్నామని పేర్కొంది. కస్టమ్స్ జీపీటీ, చాట్‌జీపీటీ, ఫెడ్ రాంప్ కోడెక్స్, ఇమేజ్ జనరేషన్, వర్క్ స్పేస్ అనలటిక్స్, కన్వర్సేషన్ సెర్చ్ వంటి సేవల్లో కూడా సమస్య వచ్చిందని కంపెనీ తెలిపింది. యూజర్ల నుంచి ఫిర్యాదులు అందినట్లు తెలిపింది. దీనిపై తమ బృందం పని చేస్తోందని పేర్కొంది. ఇప్పటికే చాట్ జీపీటీ సేవలను పునరుద్ధరించామని తెలిపింది. మిగిలిన సేవలను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని కంపెనీ వెల్లడించింది. ఈ సాంకేతిక సమస్యపై డౌన్‌డెటెక్టర్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో వినియోగదారుల నుంచి భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక్క భారతదేశంలోనే వందకు పైగా ఫిర్యాదులు నమోదైనట్లు సమాచారం. ఉచిత మరియు ప్రీమియం పెయిడ్ యూజర్లు అందరూ ఈ సమస్యను ఎదుర్కొన్నారు. సర్వర్లపై అధిక ఒత్తిడి లేదా ఇతర సాంకేతిక లోపాల కారణంగా ఈ సమస్య తలెత్తి ఉండవచ్చని భావిస్తున్నారు.

# శివ శివ... ఇదేమి దళారీ వ్యవస్థ..?

### - పట్టించుకునే నాథుడే లేదా?
### -పుణ్యక్షేత్రాలు లోనే భక్తుల దోపిడా..?
### -దేవాదాయ ఆదాయానికి గండి
### -సిబ్బంది, అధికారుల అవినీతి చేతివాటం
### -ఈవో దృష్టికి రాలేదా..? దృష్టి పెట్టలేదా..?
### -మంత్రి స్పందించి కట్టడి చేసేనా..?





శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వామి దర్శనం పేరుతో కొందరు దళారులు భక్తుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తుల కథనం ప్రకారం, శ్రీకాళహస్తి చేరుకున్న క్షణం నుంచి ఆలయ దర్శనం పూర్తయ్యే వరకు కొందరు ఆటో డ్రైవర్లు, మధ్యవర్తులు ప్రత్యేక దర్శనం, అంతరాలయ దర్శనం, వీఐపీ దర్శనం పేర్లతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్నిసార్లు అధికారిక టికెట్లు లేకుండానే కొందరు వ్యక్తులు ప్రత్యేక మార్గాల ద్వారా భక్తులను గర్భగుడి వరకు తీసుకెళ్తున్నారని కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి చర్యల వల్ల గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండే సామాన్య భక్తులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారని, ఒకవైపు తాము వేచి ఉండాల్సి వస్తుండగా మరోవైపు డబ్బులు చెల్లించిన వారిని నేరుగా దర్శనానికి అనుమతిస్తున్నారనే భావన వ్యక్తమవుతోందని భక్తులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఆలయ పరిపాలన, భద్రతా వ్యవస్థ, సంబంధిత అధికారుల పర్యవేక్షణపై కూడా అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్నట్లు చెప్పబడుతున్న ఈ కార్యకలాపాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. దేశంలోనే పేరు ప్రఖ్యాతలు గల శ్రీకాళహస్తి వంటి పవిత్ర క్షేత్రంలో దళారీ వ్యవస్థకు పూర్తిగా చెక్ పెట్టేందుకు సీసీ కెమెరాల పర్యవేక్షణను, దేవాదాయ శాఖ మంత్రి స్పందించి మరింత కఠిన తరం చేయాలని, అధికారిక టికెట్ విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని, అనధికారికంగా డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే, ప్రతి 15 రోజులకు ఒకసారి ఆలయంలోని సీసీటీవీ దృశ్యాలను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలిస్తే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భక్తుల ఆరోపణలపై దేవదాయ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించి, అవసరమైతే విజిలెన్స్ అధికారులచే ప్రత్యేక విచారణ జరిపి అవినీతి అక్రమాలపై అందుకు సహకరిస్తున్న సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. శ్రీకాళహస్తి పవిత్ర క్షేత్ర ప్రతిష్ఠను ఆలయ ఈవో కాపాడుతూ, ప్రతి భక్తుడికి పారదర్శకమైన, సమానమైన దర్శన సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

# చరిత్ర సృష్టించిన మోదీ

### - ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. జకార్తాలో మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇరు దేశాల మధ్య ఉన్న నాగరికత, చారిత్రక వారసత్వ సంబంధాలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ స్థిరత్వం కోసం ఉమ్మడిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. భారత్, ఇండోనేషియాలను సముద్రాలు వేరుచేయడం లేదని, చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలనే వారధులు రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరు దేశాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు, పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా ఎన్నికల వ్యవస్థ ఆధునికీకరణకు భారత్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) అభివృద్ధిలో తోడ్పాటునందిస్తామని, అదేవిధంగా ఇండోనేషియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భారత ప్రభుత్వ పథకాలను తమ దేశంలోనూ అమలు చేస్తామని గతంలో ఇండోనేషియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, “మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు” అని మోదీ చమత్కరించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణానికి ఈ వ్యాఖ్య అద్దం పట్టింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సహకారం అత్యంత కీలకమని ప్రధాని ఉద్ఘాటించారు. జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు.

# వరుస కథనాలు... అయినా కదలని అధికారులు

### - ‘ది నానో’ జూనియర్ కాలేజీపై ఆరోపణలు
### - ఇక జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుంటారా..?
### - ఇంటర్మీడియట్ శాఖ మౌనంపై విమర్శలు
### - సమగ్ర విచారణకు విద్యార్థి సంఘాల డిమాండ్







హైదరాబాద్(ప్రశ్న న్యూస్) బడంగ్‌పేట్ పరిధిలోని ‘ది నానో’ జూనియర్ కాలేజీపై గుర్తింపు, భవన అనుమతులు, అగ్నిమాపక భద్రత, విద్యార్థుల రక్షణ వంటి అనేక అంశాలపై వరుసగా ఆరోపణలు వెలుగులోకి వస్తున్నప్పటికీ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారుల నుంచి ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం తీవ్ర చర్చకు దారితీసింది. పలు పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమైనా, ఫిర్యాదులు అందినట్లు ప్రచారం జరిగినా, క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిగాయా లేదా అన్న విషయంపై జిల్లా ఇంటర్మీడియట్ అధికారి నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆరోపణలు నిజమా..? కాదా..? అనే విషయాన్ని తేల్చాల్సిన బాధ్యత పూర్తిగా ఇంటర్మీడియట్ బోర్డ్ శాఖలదేనని స్థానికులు, విద్యార్థి సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోపణలు వస్తున్నా అధికారులు స్పందించకుండా కాలయాపన చేయడం వల్ల విద్యార్థుల భద్రతే ప్రశ్నార్థకంగా మారుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక విద్యాసంస్థపై ఇంత తీవ్ర ఆరోపణలు వచ్చినా అధికారులు మౌనం పాటించడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

విద్యార్థుల ప్రాణాలకు సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. భవన భద్రత, అగ్నిమాపక అనుమతులు, గుర్తింపు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక బృందంతో సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని వారు కోరుతున్నారు. ఒకవేళ నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంటర్మీడియట్ శాఖ ఉన్నత అధికారులు ఇప్పటికైనా స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని, లేనిపక్షంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని ఉన్నతస్థాయి దర్యాప్తును ఆదేశించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విచారణ నివేదికను బహిర్గతం చేసి, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని వారు కోరుతున్నారు.

### ఆరోపణలు నిజం కాకపోతే కళాశాలకు క్లీన్ చిట్ ఇవ్వండి..

అనుమతి లేని కాలేజీ ఏర్పాటు చేస్తున్న ఆరోపణలు నిజమైతే నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోండి” అని స్థానికులు, విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. పత్రికలలో వరుస కథనాలు వెలువడుతున్నప్పటికీ అధికార యంత్రాంగం స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతోందని, విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ఇకపై నిర్లక్ష్యానికి తావులేకుండా వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# సముద్రంపై ఎక్కడా ఆగకుండా 11 రోజులు

### - ఓ పక్షి అద్భుత ప్రయాణం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రకృతిలో కొన్ని జీవుల పట్టుదల, సామర్థ్యాలు విస్మయానికి గురిచేస్తుంటాయి. అటువంటి వింతలో ‘బార్-టెయిల్డ్ గాడ్విట్’ అనే పక్షి సాగించే సాహసోపేత యాత్ర అద్వితీయమైంది. ఆహారం, నీరు, కనీసం విశ్రాంతి కూడా లేకుండా ఏకధాటిగా 11 రోజుల పాటు ప్రయాణించి, పసిఫిక్ మహాసముద్రాన్ని దాటగల దీని సామర్థ్యం శాస్త్రవేత్తలనే విస్తుపోయేలా చేస్తోంది. 2022లో ఒక యువ గాడ్విట్ పక్షి అలస్కా నుంచి ఆస్ట్రేలియాలోని టాస్మానియాకు నిరంతరాయంగా ప్రయాణించి కొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 11 రోజుల ఒక గంట వ్యవధిలో దాదాపు 13,560 కిలోమీటర్ల దూరాన్ని అధిగమించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఒక పక్షి ఎక్కడా ఆగకుండా ఇంత సుదీర్ఘ దూరం ప్రయాణించడం ఇదే ప్రథమం. సాధారణంగా ఆర్కిటిక్ ప్రాంతంలో నివసించే ఈ పక్షులు, శీతాకాలం ప్రారంభంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి ప్రాంతాలకు వలస వెళుతుంటాయి. ఈ అసాధారణ ప్రయాణం వెనుక ఆశ్చర్యకరమైన శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. వలస ప్రయాణానికి సిద్ధమయ్యే ముందు ఈ పక్షులు విపరీతంగా ఆహారం తీసుకుని, తమ శరీర బరువును దాదాపు రెట్టింపు చేసుకుంటాయి. ప్రయాణ సమయంలో బరువును సమతుల్యం చేసుకునేందుకు, తమ జీర్ణవ్యవస్థలోని కొన్ని అవయవాలను తాత్కాలికంగా కుదించుకుంటాయి. శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును శక్తిగా మార్చుకుంటూ వేల కిలోమీటర్లు దూరాన్ని ఇవి అధిగమిస్తాయి. మార్గమధ్యలో ఎలాంటి భూభాగం లేని విశాల సముద్రంపై ప్రయాణిస్తున్నప్పుడు, ఇవి నక్షత్రాలు మరియు భూమి యొక్క అయస్కాంత క్షేత్రాల ఆధారంగా దిశను గుర్తించగలవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రయాణ సమయంలోనే మెదడులోని ఒక భాగానికి విశ్రాంతినిస్తూ, మరో భాగంతో అప్రమత్తంగా ఉంటూ తమ నిద్ర అవసరాలను తీర్చుకుంటాయని భావిస్తున్నారు. ఈ పక్షుల యాత్రలు జీవ పరిణామం, శక్తి వినియోగం వంటి అంశాలపై మరిన్ని నూతన పరిశోధనలకు స్ఫూర్తినిస్తున్నాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588